


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 9 సంచిక : 158 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : కాకినాడ | గురువారం 12 ఫిబ్రవరి 2026 | వెల : 1/-రూ ॥

VOLUME :9 ISSUE : 158 PAGES :8 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : KAKINADA | THU 12 FEBRUARY 2026 | PRICE : 1/- RS

Simultaneously Published form Kakinada,Ongole,Visakhapatnam,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

## మరో 15 ఏళ్లు మనం ఇలాగే బలంగా నిలబడాలి

- ఐక్యంగా ఉంటేనే గుజరాత్ తరహాలో అభివృద్ధి సాధ్యమని స్పష్టం
- ప్రభుత్వ విజయాలను ఎమ్మెల్యేలు ఓన్ చేసుకోవాలని, సభకు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశం
- కేంద్రం సహకారంతోనే పోలవరం, అమరావతి, స్టీల్ ప్లాంట్ వంటివి గాడిన పడ్డాయని వెల్లడి
- విభేదాలుంటే అంతర్గతంగా చర్చిద్దామని పవన్ పిలుపు





**పెన్ పవర్ డెస్క్:**రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి మరో 15 ఏళ్ల పాటు ఐక్యంగా, బలంగా కొనసాగాలని, అప్పుడే గుజరాత్ తరహాలో సుస్థిరమైన అభివృద్ధి సాధ్యమవుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షించారు. ఎన్నికల సమయంలో ప్రజల ముందు ఏ స్ఫూర్తితో నిలబడ్డామో, అదే ఐక్యతను భవిష్యత్తులోనూ కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చారు. మంగళవారం అసెంబ్లీ కమిటీ హాలులో జరిగిన ఎన్డీఏ శాసనసభా పక్ష సమావేశంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను ఉద్దేశించి ఆయన సుదీర్ఘంగా ప్రసంగించారు. గడిచిన 20 నెలల్లో కూటమి నాయకత్వంలో ఎక్కడా విభేదాలు రాకపోవడం శుభపరిణామమని, ఇదే ఐక్యతతో పనిచేసి ఎమ్మెల్యేలు ప్రజల్లో మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు.ఎన్నికల నాటి కంటే ఇప్పుడు కూటమిపై ప్రజా మద్దతు మరింత పెరిగిందని చంద్రబాబు అన్నారు. "గుజరాత్‌లో బీజేపీ వరుసగా ఐదుసార్లు గెలిచి అధికారంలో ఉంది. ఒకే ప్రభుత్వం సుదీర్ఘకాలం కొనసాగడం వల్లే అక్కడ అభివృద్ధి సాధ్యమైంది. మన రాష్ట్రంలోనూ అదే జరగాలి. మరో 15 ఏళ్ల పాటు మూడు పార్టీలు ఐక్యంగా ప్రజల వద్దకు వెళ్లి ఓట్లు అడిగే పరిస్థితి రావాలి. అప్పుడే శాశ్వతంగా రాజకీయాల్లో నిలబడగలం" అని ఆయన దిశానిర్దేశం చేశారు.

**ఎమ్మెల్యేలకు స్పష్టమైన ఆదేశాలు**

ఈ సందర్భంగా శాసనసభ్యులకు ముఖ్యమంత్రి పలు కీలక సూచనలు చేశారు. "అసెంబ్లీ సమావేశాలను ప్రతి సభ్యుడు సీరియస్‌గా తీసుకోవాలి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అందరూ సభలోనే ఉండాలి. నేను కూడా సభను పూర్తిగా ఫాలో అవుతాను. సభలో సబ్జెక్టులపై అర్థవంతమైన చర్చలు జరగాలి. ఎదుటివారు తిట్టారని మనం కూడా బూతులు తిట్టకూడదు. ప్రజామోదయోగ్యంగా సభను నడుపుదాం" అని అన్నారు. త్వరలోనే జిల్లాల వారీగా ఎమ్మెల్యేలు, ఎంపీలు, కలెక్టర్లు, ఎస్పీలతో ఉమ్మడి సమావేశాలు నిర్వహించి, నియోజకవర్గాల్లో పెండింగ్ పనులను ప్రాధాన్యతా

- మిగతా 2లో



### సున్నిత రంగాలపై ఎప్పుడూ స్పష్టమైన వైఖరితో ఉన్నామని వెల్లడి

- అమెరికాతో వాణిజ్య ఒప్పందం... వాణిజ్య శాఖ కార్యదర్శి కీలక వ్యాఖ్యలు
- అత్యంత కీలకమైన రంగాలను దృష్టిలో ఉంచుకొని చర్చలు జరిపామన్న వాణిజ్య శాఖ కార్యదర్శి
- రైతులు, మత్స్యకారులు, పాడి పరిశ్రమలను రక్షించేలా చర్యలు తీసుకున్నామని వెల్లడి

- మిగతా 2లో



### ఇకపై స్కూళ్లలో వందేమాతరం తప్పనిసరి..

- జనగణమన కంటే ముందు తప్పనిసరి: 'వందేమాతరం'పై కేంద్రం కీలక నిర్ణయం
- కొత్త నిబంధనలు విడుదల చేసిన కేంద్ర హోంమంత్రిత్వ శాఖ
- ప్రభుత్వ కార్యక్రమాలు, పాఠశాలల్లో వందేమాతరం తప్పనిసరి
- అంతరాయం కలిగిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరిక

'వందేమాతరం' గీతాన్ని అన్ని ప్రభుత్వ కార్యక్రమాలు, అన్ని పాఠశాలల్లో తప్పనిసరి చేస్తూ కేంద్ర హోంమంత్రిత్వ శాఖ బుధవారం కొత్త నిబంధనలు తీసుకువచ్చింది.

- మిగతా 2లో



### అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు: ఏపీ గవర్నర్ ప్రసంగం...

- రాష్ట్ర పునర్నిర్మాణ ప్రక్రియ గాడిన పడిందన్న గవర్నర్ అబ్దుల్ నజీర్
- ఉభయ సభలను ఉద్దేశించి బడ్జెట్ సమావేశాల తొలిరోజు ప్రసంగం
- రాష్ట్ర జీఎస్‌డీపీ రూ.17.62 లక్షల కోట్లకు చేరిందని వెల్లడి
- తలసరి ఆదాయం రూ.2.95 లక్షలకు పెరిగిందని స్పష్టీకరణ
- గత ప్రభుత్వ పాలనపై 7 శ్వేతపత్రాలు విడుదల చేశామని వెల్లడి

**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణ ప్రక్రియ పక్కాగా గాడిన పడిందని, ఆర్థిక పరిమితులు ఉన్నప్పటికీ జాగ్రత్తతో కూడిన ప్రాధాన్యతలు, సంస్కరణల ద్వారా రాష్ట్రం వృద్ధి పథంలోకి తిరిగి వస్తోందని గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ అన్నారు. బుధవారం నాడు బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా శాసనసభ, శాసనమండలి ఉభయ సభలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. గత 21 నెలల్లో ప్రభుత్వం మౌలిక సంస్కరణలను పూర్తి చేసిందని, అన్ని రంగాల్లోనూ స్పష్టమైన ఫలితాలు కనిపిస్తున్నాయని తెలిపారు.సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన ద్వారా రాష్ట్రాన్ని పునర్నిర్మించే బాధ్యతను ప్రజలు తమ

- మిగతా 2లో

## గవర్నర్‌తో పచ్చి అబద్ధాలు చెప్పించారు



- గవర్నర్ ప్రసంగం అవాస్తవాలు, కల్పితాలతో నిండిన డొల్ల పత్రం అని షర్మిల విమర్శ
- కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలను పూర్తిగా విస్మరించిందని ఆరోపణ
- పోలవరం ఎత్తు తగ్గించి, ఆరోగ్యశ్రీని చంపేస్తున్నారని ప్రభుత్వంపై విమర్శలు
- ప్రతిపక్ష నేతగా జగన్ విఫలమయ్యారని, దమ్ముంటే రాజీనామా చేయాలని డిమాండ్

- మిగతా 2లో



## ఏం చేద్దాం శ్రీనివాస్?

### అసెంబ్లీ బయట దువ్వాడ శ్రీనివాస్ కు జగన్ పలకరింపు

- ఏడు నెలల క్రితం వైసీపీ నుంచి దువ్వాడ బహిష్కరణ
- జగన్ తో మాట్లాడే ప్రయత్నం చేసిన దువ్వాడ
- వైసీపీ అవకాశం ఇవ్వకపోతే సొంతంగా పోటీ చేస్తానన్న దువ్వాడ

**పెన్ పవర్ డెస్క్:**వైసీపీ నుంచి ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ను బహిష్కరించిన సంగతి తెలిసిందే. అయితే, అసెంబ్లీ ప్రాంగణంలో ఒక ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. అసెంబ్లీ నుంచి జగన్ బయటకు వస్తున్న సమయంలో ఆయనను దువ్వాడ శ్రీనివాస్ కలిశారు.

- మిగతా 2లో

## వైసీపీ పట్ల అప్రమత్తంగా ఉండండి

### మూడు పార్టీలకు పవన్ కల్యాణ్ సూచన

- చంద్రబాబు అధ్యక్షతన ఎన్డీయే శాసనసభాపక్ష సమావేశం
- వైసీపీ కుట్రల పట్ల టీడీపీ, జనసేన, బీజేపీ అప్రమత్తంగా ఉండాలని పవన్ సూచన
- హిందూమతాన్ని రాజకీయంగా ఉపయోగించుకోవాలని వైసీపీ చూస్తోందని ఆరోపణ



**పెన్ పవర్ డెస్క్:**వైసీపీపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ సమావేశాలకు హాజరైన 11 మంది వైసీపీ ఎమ్మెల్యేలు గవర్నర్ ప్రసంగిస్తుండగా 11 నిమిషాల పాటు నిరసన తెలిపి వాకౌట్ చేశారు.

- మిగతా 2లో

## భారత్‌ను అమెరికాకు అమ్మేశారు

### కేంద్రంపై రాహుల్ గాంధీ ఫైర్

- భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై కేంద్ర ప్రభుత్వంపై రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు
- ఆర్థిక మంత్రి నవ్వుతూ ఉంటారు.. మన డేటాతో ఏం చేశారని లోక్‌సభలో ప్రశ్న
- ఈ ఒప్పందంతో దేశ టెక్స్‌టైల్ పరిశ్రమ, రైతులు నాశనమవుతారని ఆరోపణ
- దేశ ప్రయోజనాలను అమెరికాకు అమ్మేశారంటూ సంచలన వ్యాఖ్యలు
- ఇంధన స్వాతంత్ర్యాన్ని కూడా అమెరికాకు తాకట్టు పెట్టారని ధ్వజం



**పెన్ పవర్ డెస్క్:**లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. భారత్–అమెరికా మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందంపై ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ ఒప్పందం దేశ ప్రయోజనాలకు గొడ్డలిపెట్టు అని, దీని ద్వారా దేశాన్ని, 'భారత మాత'ను అమెరికాకు అమ్మేశారని సంచలన వ్యాఖ్యలు చేశారు. బుధవారం కేంద్ర బడ్జెట్‌పై జరిగిన చర్చలో పాల్గొన్న రాహుల్, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను లక్ష్యంగా

- మిగతా 2లో

## మహారాష్ట్రలో దేశంలోనే మొట్టమొదటి మ్యూజికల్ రోడ్డు..

- ముంబై కోస్టల్ రోడ్డులోని నారిమన్ ప్రాంతం నుంచి వర్లి వైపు వెళ్లే దారిలో సంగీత స్ట్రిప్‌లు
- ప్రారంభించిన ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్
- వాహనదారులకు అలరించనున్న స్లమ్ డాగ్ మిలియనీర్ చిత్రంలోని 'జయహో' పాట

2లో



## ఏపీ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం.. 11 నిమిషాల్లోనే వెళ్లిపోయిన జగన్

- ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ సభలోకి వచ్చిన వైసీపీ సభ్యులు
- గవర్నర్ ప్రసంగానికి పదేపదే అడ్డుతగిలిన వైనం
- ప్రతిపక్ష హోదా ఇవ్వాలంటూ పట్టుబట్టిన వైసీపీ

2లో



## ఎడిటర్ వ్యూ

# మదుపర్లకు భద్రత.. మార్కెట్‌కు ముప్పు!

ఈసారి ప్రవేశపెట్టిన బడ్జెట్ కొందరిని మెప్పించగా.. మరికొందరిని నిరాశపర్చింది. దీని ప్రభావం స్టాక్ మార్కెట్‌పై కూడా పడింది. 1999 తర్వాత మళ్లీ ఆదివారం నిర్వహించిన 'ఫుల్ సెషన్' నష్టాల్లో ముగిసింది. సెన్సెక్స్ సుమారు 1500 పాయింట్లు, నిఫ్టీ సుమారు 500 పాయింట్లు పడిపోయింది. అయితే ఈ బడ్జెట్లో స్టాక్ మార్కెట్ ట్రేడింగ్‌కు సంబంధించి 'ఫ్యూచర్ అండ్ ఆప్షన్స్' విభాగంలో తీసుకున్న నిర్ణయం ఇప్పుడు చర్చ నీయాంశంగా మారింది. ఇది మదుపర్లకు భద్రతగా కొందరు విశ్లేషిస్తుండగా.. మరికొందరు భవిష్యత్తులో 'మార్కెట్'కు ముప్పు తప్పదేమోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాజా బడ్జెట్‌లో కేంద్రం 'డెరివేటివ్స్ మార్కెట్'కు సంబంధించి పన్నులను భారీగా పెంచింది. స్పెక్యులేషన్‌ను తగ్గించే పేరుతో ఎస్‌టీటీ (సెక్యూరిటీ ట్రాన్సాక్షన్ ట్యాక్స్) రేట్లను సవరించింది. ఈక్విటీ ఫ్యూచర్స్ ట్రేడింగ్‌పై పన్నును 150 శాతం పెంచింది. మరీ ముఖ్యంగా రిటైల్ ట్రేడర్లు ఎక్కువగా ఆసక్తి చూపించే ఆప్షన్స్ ట్రేడింగ్‌లో.. ప్రీమియం విలువను 50 శాతం పెంచింది. ఫ్యూచర్స్ ఎక్సర్ సైజ్ చేసేటప్పుడు ఉన్న ఎస్టీటీని 20 శాతం పెంచింది. ఈ పన్ను పెంపులను 'సామాన్యుల రక్షణ కవచం'గా కొందరు అభివర్ణిస్తున్నారు.. గతంలో విడుదలైన నివేదికల ప్రకారం.. ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ విభాగంలో ట్రేడింగ్ చేస్తున్న వారిలో 90 శాతం మంది నష్టాల పాలవుతున్నారు. స్టాక్ మార్కెట్‌పై పరిజ్ఞానం లేని యువత, వేతన జీవులు.. త్వరగా సంపన్నులవ్వాలనే ఆశతో ఇందులో దిగి ఉన్నది పోగొట్టుకుంటున్నారు. పన్నులు పెంచడం ద్వారా వీరి ప్రవేశాన్ని కఠినతరం చేసినట్లవుతుంది. మరోవైపు స్టాక్ మార్కెట్ అనేది సంపద సృష్టికి వేదిక.. కానీ క్షణాల్లో లాభ నష్టాలను తేల్చే జూదశాలగా కొందరు మార్చేశారు. అధిక పన్నుల వల్ల స్పెక్యులేషన్ ఆధారంగా జరిగే ట్రేడింగ్ తగ్గి.. పెట్టే పెట్టుబడులు స్థిరమైన ఈక్విటీలు, మ్యూచువల్ ఫండ్ల వైపు మళ్లే అవకాశముంది. చిన్న మొత్తాలతో పెద్ద రిస్క్ తీసుకునే ధోరణిని తగ్గించి.. ప్రజల్లో పొదుపు, సురక్షితమైన పెట్టుబడి అలవాట్లను ప్రోత్సహించడానికి ఈ పన్ను పెంపు దోహదపడుతుందనే అభి ప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ పన్ను పెంపు వల్ల మార్కెట్‌పై ప్రతికూల ప్రభావం పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయనే ఆందోళనలు సైతం వ్యక్తమవుతున్నాయి. మార్కెట్ సజావుగా సాగాలంటే కొనుగోలు, అమ్మకం దారుల రద్దీ (లిక్విడిటీ/వాల్యూమ్) ఉండాలి. పన్ను భారం వల్ల ట్రేడర్లు మార్కెట్ నుంచి తప్పుకుంటే ట్రేడింగ్ పరిణామం భారీగా పడిపోతుంది. దీని వల్ల పెద్ద ఇన్వెస్టర్లు తమ షేర్లను అమ్ముకోవాలన్నా, కొనాలన్నా ఇబ్బంది అవు తుంది. ఇది మార్కెట్ పతనానికి దారితీయొచ్చుననే ఆందోళన సైతం ఉన్నది. మ్యూచువల్ ఫండ్స్, బీమా సంస్థలు తమ నష్టాల ను తగ్గించుకోవడానికి ఎఫ్ అండ్ ఓ మార్కెట్‌ను వాడుకుంటాయి. ఇప్పుడు పన్నుల పెంపుతో ఇది ఖరీదైన వ్యవహారంగా మారుతుంది. పరోక్షంగా ఈ భారం మళ్లీ సామాన్య మదుపర్లపైనే పడుతుంది. చట్టబద్ధమైన పన్నులు భరించలేక ట్రేడర్లు ప్రభుత్వ నియంత్రణ లేని 'డబ్బా ట్రేడింగ్' లేదా విదేశీ యాప్స్ ద్వారా జరిగే ఫారెక్స్, క్రిప్టో ట్రేడింగ్ వైపు మళ్లే ప్రమాదముంది. అంతేకాకుండా స్టాక్ బ్రోకింగ్ సంస్థలు, ట్రేడింగ్ పై ఆధారపడి జీవిస్తున్న ప్రొఫెషనల్ ట్రేడర్ల ఆదాయంపై ఇది కోలుకోలేని దెబ్బవేస్తుంది. ఫిన్ టెక్ రంగంలో ఉద్యోగాల కోతకు సైతం దారితీయొచ్చు. సామాన్యులను ఆర్థిక నష్టాల నుంచి కాపాడాలనే ప్రభుత్వ ఉద్దేశ్యం మంచిదే అయినా.. దాని కోసం ఎంచు కున్న మార్గం మార్కెట్ సమతుల్యను దెబ్బతీయొద్దు. ప్రభుత్వం మార్కెట్ పరిస్థితులను నిశితంగా గమనిస్తూ.. అవసరమైతే భవిష్యత్తులో దిద్దుబాటు చర్యలు చేపడితే బాగుంటుంది.

## వైసీపీ పట్ల అప్రమత్తంగా ఉండండి

- మొదటి పేజి తరువాయి

అసెంబ్లీ వాయిదా పడిన అనంతరం కమిటీ హాలులో చంద్రబాబు అధ్యక్షతన నిర్వహించిన ఎన్డీయే శాసనసభాపక్ష సమావేశంలో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, వైసీపీ కుట్రల పట్ల కూటమిలోని టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

వైసీపీ హిందూమతాన్ని రాజకీయంగా ఉపయోగించుకోవాలని చూస్తోందని ఆరోపించారు. దక్షిణ భారతదేశంలో ప్రతి ఒక్కరూ హిందూమతాన్ని గౌరవిస్తారని అన్నారు. మన ప్రభుత్వంపై జగన్, ఆయన పార్టీ చేసే కుట్రలను గుర్తించాలని అన్నారు.

అనంతరం, పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ, సభలో ఎంతసేపు మాట్లాడామనే దానికంటే అవసరమైన విషయం ఎంత మాట్లాడామనేది ముఖ్యమని అన్నారు. దావోస్‌లో ముఖ్యమంత్రి, తాను ప్రతి సంస్థపై ముందస్తుగా కసరత్తు చేసినట్లు చెప్పారు. అందుకే తమను కలిసిన ప్రతి సంస్థకు ముఖ్యమంత్రి క్లుప్తంగా ఏడు నిమిషాల్లోనే విషయం చెప్పి ముగించేవారని గుర్తు చేసుకున్నారు. అందుకే తక్కువ సమయంలో ఎక్కువమంది పారిశ్రామికవేత్తలను ముఖ్యమంత్రి కలవగలిగారని అన్నారు. శాసనసభలో కూడా సభ్యులు ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. జగన్ పలకరింపు అనంతరం మీడియాతో దువ్వాడ మాట్లాడుతూ... త్వరలోనే జగన్ ను కలుస్తానని, వైసీపీలో అవకాశం ఇవ్వకుంటే, సొంతంగా పోటీ చేసి తన బలం చూపిస్తానని అన్నారు. శాసనమండలిలో తన వ్యక్తిగత అజెండాతో ముందుకు వెళతానని, ప్రజా సమస్యలను ప్రస్తావిస్తానని చెప్పారు. తిరుమల లడ్డూ వ్యవహారంలో భక్తుల వైపు మాట్లాడతానని అన్నారు.

# మరో 15 ఏళ్లు మనం ఇలాగే బలంగా నిలబడాలి

- మొదటి పేజి తరువాయి

క్రమంలో పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు.

**విశాఖ స్టీల్ ప్లాంట్ కోసం కేంద్రం తన పాలసీనే మార్చుకుంది**

కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారం వల్లే రాష్ట్రం వేగంగా కోలుకుంటోందని చంద్రబాబు వివరించారు. "వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రాన్ని గాడిన పెట్టామంటే దానికి కేంద్రం చేయూతే కారణం. అమరావతి, పోలవరం ప్రాజెక్టులకు కేంద్రం నిధులు ఇవ్వకపోయి ఉంటే అవి ముందుకు కదిలేవి కావు. 2027 జూన్ నాటికి పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం ఇస్తున్నామంటే అది కేంద్రం సాయంతోనే. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను నిలబెట్టేందుకు కేంద్రం తన పాలసీనే మార్చుకుంది. ఫలితంగా, మొదటిసారిగా స్టీల్ ప్లాంట్ ఒక్క నెలలో రూ.54 కోట్ల లాభాలు సాధించింది. సూపర్ సిక్స్‌తో సహా అన్ని పథకాలు అమలు చేస్తున్నామంటే దాని వెనుక కేంద్రం అండ ఉంది. ఈ ప్రభుత్వ కార్యక్రమాలను ప్రతి ఎమ్మెల్యే ఓన్ చేసుకోవాలి" అని ఆయన పిలుపునిచ్చారు.

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కూటమి నేతలు ఎదుర్కొన్న అణచివేతను చంద్రబాబు గుర్తుచేశారు. పవన్ కల్యాణ్‌ను విశాఖలో హోటల్ గదికే పరిమితం చేయడం, తన అరెస్టు సమయంలో ఆయనకు అడుగడుగునా అడ్డంకులు సృష్టించడం వంటి ఘటనలను ప్రస్తావించారు. అలాంటి ఎన్నో సవాళ్లను ఎదుర్కొని ఐక్యంగా నిలబడి గెలిచామని, ఈ స్ఫూర్తిని ఎప్పటికీ మరువకూడదని హితవు పలికారు.

**కూటమి ధర్మానికి కట్టుబడి ఉందాం: పవన్ కల్యాణ్**

ముఖ్యమంత్రి అభిప్రాయంతో డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ పూర్తిగా ఏకీభవించారు. గత 20 నెలలుగా ఐక్యంగా పనిచేసి, వైసీపీ ఐదేళ్ల విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని గట్టెక్కించి ప్రగతి బాట పట్టిస్తున్నామని అన్నారు. "రాష్ట్రాభివృద్ధి కోసం మరో 15 ఏళ్లు కూటమి కలిసి ఉంటుంది. ఐక్యంగా ముందుకు వెళ్తుంది. ఎన్నికల్లో ఏ స్ఫూర్తితో పనిచేశామో, అదే స్ఫూర్తి భవిష్యత్తులోనూ అవసరం. పార్టీల మధ్య ఏవైనా భిన్నాభిప్రాయాలు ఉంటే, వాటిని అంతర్గతంగా కూర్చుని పరిష్కరించుకోవాలి. ప్రతి ఒక్కరూ కూటమి ధర్మానికి కట్టుబడి పనిచేయాలి" అని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.

# సున్నిత రంగాలపై ఎప్పుడూ స్పష్టమైన వైఖరితో ఉన్నామని వెల్లడి

వాణిజ్య ఒప్పందాలలో, సున్నిత రంగాలపై భారతదేశం ఎల్లప్పుడూ స్పష్టమైన వైఖరితో చర్చలు జరిపిందని, అమెరికాతో వాణిజ్య ఒప్పందం విషయంలోనూ వ్యవసాయం సహా కీలక రంగాల ప్రయోజనాలను కాపాడేలా ముందుకు వెళ్లామని భారత వాణిజ్య శాఖ కార్యదర్శి రాజేష్ అగర్వాల్ వెల్లడించారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై ప్రతిపక్ష పార్టీలు విమర్శలు చేస్తున్న నేపథ్యంలో ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. దేశానికి అత్యంత కీలకమైన రంగాలను దృష్టిలో ఉంచుకుని స్పష్టమైన వైఖరితోనే వాణిజ్య చర్చలు జరిపినట్లు తెలిపారు. అన్ని ఒప్పందాల విషయంలో ఇలా స్పష్టమైన వైఖరితోనే ఉన్నామని అన్నారు. మన రైతులు, మత్స్యకారులు, పాడిపరిశ్రమ సహా ప్రభావితమవుతాయని భావించిన రంగాలను దృష్టిలో ఉంచుకుని, వాటిని రక్షించేలా చర్యలు తీసుకున్నామని అన్నారు. భారత్, అమెరికా ఉమ్మడి ప్రకటనను చట్టబద్ధమైన ఒప్పందంగా మార్చడానికి ఇరు దేశాలు పనిచేస్తున్నాయని, మార్చి నెలాఖరు నాటికి దీనిని ఖరారు చేసి సంతకాలు చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు జరిగిన అన్ని ఒప్పందాలలో సున్నితమైన రంగాలకు రక్షణ కల్పించామని, అంతగా సున్నితం కానటువంటి రంగాల విషయంలో మాత్రం మన మార్కెట్‌ను తెరిచేందుకు సుంకాలను ఉపయోగించామని తెలిపారు. కీలకమైన మన ఉత్పత్తులు ఉన్న రంగాల్లో మాత్రం మార్కెట్ ఇవ్వలేమని అమెరికాకు స్పష్టం చేశామని అన్నారు.

# ఏపీ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం.. 11 నిమిషాల్లోనే వెళ్లిపోయిన జగన్

ఏపీ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగిస్తున్నారు. మరోపక్క, శాసనసభకు వైసీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి జగన్ చేరుకున్నారు. 'ప్రతిపక్ష హోదా ఇవ్వాలి' అనే ప్లకార్డులను, బ్యానర్లను పట్టుకుని వీరు అసెంబ్లీకి చేరుకున్నారు. వైసీపీ సభ్యులంతా కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసుకుంటూ వచ్చారు. గేట్ నెంబర్ 4 నుంచి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసుకుంటూ వీరు సభలోకి వెళ్లారు.

గవర్నర్ ప్రసంగిస్తున్న సమయంలో ఆయన ప్రసంగానికి పదేపదే ఆటంకం కలిగిస్తూ వైసీపీ సభ్యులు నినాదాలు చేశారు. గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకునే ప్రయత్నం చేశారు. వైసీపీకి ప్రతిపక్ష హోదా ఇవ్వాలంటూ నినదించారు. సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలని, నిరుద్యోగ భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అయితే, 11 నిమిషాల వ్యవధిలోనే గవర్నర్ ప్రసంగాన్ని బాయ్ కాట్ చేసి, సభ నుంచి బయటకు వెళ్లిపోయారు. సభ నుంచి బయటకు వచ్చిన వెంటనే జగన్ తన కాన్వాయ్ లో తాడేపల్లిలోని నివాసానికి వెళ్లిపోయారు. దీంతో, సభలో జగన్ ఏదైనా మాట్లాడతారేమోనని ఎదురు చూసినవారంతా నిరాశకు గురయ్యారు. ప్రస్తుతం సభలో గవర్నర్ ప్రసంగం కొనసాగుతోంది.

# గవర్నర్‌తో పచ్చి అబద్ధాలు చెప్పించారు

రాష్ట్ర బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా గవర్నర్ చేసిన ప్రసంగం పూర్తిగా డొల్లగా, అవాస్తవాలు, కల్పితాలతో నిండి ఉందని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో విమర్శించారు. ఎన్నికల మ్యానిఫెస్టోకు కొన్ని మెరుగులు దిద్ది చదివినట్లుగా ఉందని, రాష్ట్ర అభివృద్ధిపై కూటమి ప్రభుత్వానికి ఎలాంటి దశ, దిశ లేదని ఆమె ఎద్దేవా చేశారు. 19 నెలల పాలన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే గవర్నర్‌తో పచ్చి అబద్ధాలు చెప్పించారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వానికి పాలనపై విజన్ గానీ, విజ్ఞత గానీ లేవని, సుపరిపాలన, సమతూకం మచ్చుకైనా కనిపించడం లేదని దుయ్యబట్టారు.

సూపర్ సిక్స్ హామీలు సూపర్ ఫ్లాప్ అయ్యాయని షర్మిల విమర్శించారు. రూ. 33 వేల కోట్లతో వాటిని అమలు చేస్తున్నామని చెప్పడం పూర్తిగా బూటకమని అన్నారు. నిరుద్యోగులకు నెలకు రూ. 3 వేలు ఇస్తామన్న నిరుద్యోగ భృతి హామీ అడ్రస్ లేకుండా పోయిందని, తల్లికి వందనం కింద 20 లక్షల మంది విద్యార్థులను, అన్నదాత సుఖీభవ కింద 40 లక్షల మంది రైతులను మోసం చేశారని ఆరోపించారు. మెగా డీఎస్సీని దగా డీఎస్సీగా మార్చారని, గోడ క్యాలెండర్లు మారుతున్నా జాబ్ క్యాలెండర్ మాత్రం రావడం లేదని విమర్శించారు. కోటి మంది మహిళలకు నెలకు రూ. 1500 ఇచ్చే ఆడబిడ్డ పథకానికి దిక్కులేదని, కానీ 5 లక్షల మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా మారుస్తున్నామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు ఎత్తును 41.15 మీటర్లకు తగ్గించి దానిలో జీవం తీశారని షర్మిల ఆవేదన వ్యక్తం చేశారు. సంజీవని లాంటి ఆరోగ్యశ్రీని యూనివర్సల్ హెల్త్ పాలసీ పేరుతో చంపేశారని, 1.43 కోట్ల కుటుంబాలకు వైద్యాన్ని అందని ద్రాక్ష చేశారని మండిపడ్డారు. రూ. 13 లక్షల కోట్ల పెట్టుబడులు, 20 లక్షల ఉద్యోగాలు అనేవి అభూత కల్పనలని కొట్టిపారేశారు. రాజధాని అమరావతికి చట్టబద్ధత అంటూ డ్రామాలు ఆడుతున్నారే తప్ప చేతల్లో అది కనిపించడం లేదని అన్నారు. కిలో రూపాయికి టమాటో, ఉల్లి అమ్ముకుంటున్న రైతులను పట్టించుకోకుండా, మార్కెట్ ఇంటర్వెన్షన్ ద్వారా ఆదుకున్నామని చెప్పడం దారుణమని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా వైసీపీ అధినేత జగన్ వైఖరిపైనా షర్మిల తీవ్రస్థాయిలో

ధ్వజమెత్తారు. ప్రజలు ఓట్లేసి గెలిపించింది ఒక్కరోజు మురిపెం కోసం కాదని, మైకు ఇస్తేనే మాట్లాడతా అని మారం చేయడానికి అసెంబ్లీకి పంపలేదని అన్నారు. జగన్ తన సొంత అజెండాను పక్కనపెట్టి, ప్రజా అజెండాతో సభకు వెళ్లి అధికార పక్షాన్ని నిలదీయాలని హితవు పలికారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై, హామీలపై సభావేదికగా పోరాడాలని సూచించారు. శాసనసభకు వెళ్లే దమ్ము, ధైర్యం లేకుంటే జగన్ తన ఎమ్మెల్యేలతో సహా రాజీనామా చేయాలని షర్మిల సవాల్ విసిరారు.

# మహారాష్ట్రలో దేశంలోనే మొట్టమొదటి మ్యూజికల్ రోడ్డు..

ముంబై కోస్టల్ రోడ్ (ఎంసీఆర్పీ) లోని కొంత భాగం దేశీయ మొట్టమొదటి సంగీత రహదారిగా (మ్యూజికల్ రోడ్డు) మారింది. హంగేరియన్ టెక్నాలజీ సహకారంతో కోస్టల్ రోడ్డులోని నారిమన్ ప్రాంతం నుంచి వర్లి వైపు వెళ్లే క్యారేజ్‌వేపై 700 మీటర్ల మేర పలు సంగీత స్ట్రిప్‌లను ఏర్పాటు చేశారు. దీంతో ఈ రోడ్డుపై ప్రయాణించే వాహనదారులకు స్లమ్‌డాగ్ మిలియనీర్ సినిమాలోని 'జయహో' పాటను వినిపించనుంది.

ఈ పాటను దేశానికి అంకితం చేయడానికి, ప్రజల్లో దేశభక్తి భావాన్ని పెంపొందించడానికి ఈ విధంగా డిజైన్ చేసినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఈ మ్యూజికల్ రోడ్డు ఈ మార్గం గుండా వాహనదారులను అలరిస్తుందని అన్నారు. బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ చేపట్టిన ఈ ప్రాజెక్టుకు రూ.6.21 కోట్ల వ్యయం అయినట్లు అధికారులు తెలిపారు.

ముంబై కోస్టల్ రోడ్డు

కారిడార్ ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన ఈ రహదారి దేశంలోనే మొట్టమొదటి మ్యూజికల్ రోడ్డుగా నిలుస్తుందని అన్నారు. ఇటువంటి మ్యూజికల్ రహదారులు హంగేరీ, జపాన్, దక్షిణ కొరియా, యునైటెడ్ అరబిక్ ఎమిరేట్స్‌లో మాత్రమే ఉన్నాయని అన్నారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ దీనిని ఈరోజు ప్రారంభించారు.

# ఏం చేద్దాం శ్రీనివాస్?

- మొదటి పేజి తరువాయి

ఆయనను చూసిన జగన్ పలకరించారు. ఏం చేద్దాం శ్రీనివాస్? అని ప్రశ్నించారు. మాజీ మంత్రి ధర్మానతో ఉన్న అంశాలపై మాట్లాడాలని జగన్ ను దువ్వాడ కోరారు. దీంతో, తాడేపల్లిలోని తన నివాసానికి రావాలని జగన్ ఆయనకు చెప్పారు. అక్కడి నుంచి తన కాన్వాయ్ ఎక్కి తాడేపల్లికి బయల్దేరారు. కొన్ని వివాదాల నేపథ్యంలో ఏడు నెలల క్రితం వైసీపీ నుంచి దువ్వాడను బహిష్కరించారు. అప్పటి నుంచి పార్టీతో సంబంధం లేకుండా దువ్వాడ ఉంటున్నారు. శాసనమండలి సమావేశాలకు మాత్రం తప్పకుండా హాజరవుతున్నారు. ఈ క్రమంలో, ఈరోజు అసెంబ్లీని వాకౌట్ చేసి జగన్ వెళ్లిపోతున్న సమయంలో ఆయనకు దువ్వాడ ఎదురయ్యారు. జగన్ పలకరింపు అనంతరం మీడియాతో దువ్వాడ మాట్లాడుతూ... త్వరలోనే జగన్ ను కలుస్తానని, వైసీపీలో అవకాశం ఇవ్వకుంటే, సొంతంగా పోటీ చేసి తన బలం చూపిస్తానని అన్నారు. శాసనమండలిలో తన వ్యక్తిగత అజెండాతో ముందుకు వెళతానని, ప్రజా సమస్యలను ప్రస్తావిస్తానని చెప్పారు. తిరుమల లడ్డూ వ్యవహారంలో భక్తుల వైపు మాట్లాడతానని అన్నారు.

## ఇకపై స్కూళ్లలో వందేమాతరం తప్పనిసరి..

- మొదటి పేజి తరువాయి

'జనగణమన' వంటి జాతీయ గీతాల కంటే ముందు దీనిని కచ్చితంగా ఆలపించాలని ఈ నిబంధనలలో పేర్కొంది. వందేమాతర గీతం ఆలపించినప్పుడు అందరూ నిలబడాలని పేర్కొంది. అన్ని పురస్కారాలు ఇచ్చే సమయంలో, రాష్ట్రపతి హాజరయ్యే అన్ని కార్యక్రమాల్లో వందేమాతరం ఆలపించాలని ఈ నిబంధనల్లో పేర్కొంది. జాతీయ గీతం, గేయం పాడుతుండగా అంతరాయం కలిగించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపింది. తాజాగా విడుదల చేసిన నిబంధనల కింద బాధ్యులకు గరిష్ఠంగా మూడేళ్ళ జైలు శిక్ష విధించనున్నట్లు స్పష్టం చేసింది. సినిమా హాల్స్ వంటి ప్రదేశాల్లో కూడా దీనిని తప్పనిసరి చేసింది. ఈ సందర్భాల్లో నిలబడటాన్ని తప్పనిసరి చేయలేదు.

కేంద్ర ప్రభుత్వం 'వందేమాతరం' 150వ వార్షికోత్సవాలను నిర్వహిస్తోంది. ఈ క్రమంలో ఈ కొత్త నిబంధనలను విడుదల చేసింది. 1937లో తొలగించిన నాలుగు చరణాలతో కలిపి మొత్తం ఆరు చరణాలను పాడాలని కేంద్రం వెల్లడించింది. స్వాతంత్ర పోరాట సమయంలో ముస్లిం లీగ్ అభ్యంతరాల మేరకు నాలుగు చరణాలను తొలగించిన కాంగ్రెస్, రెండు చరణాలను స్వీకరించింది. స్వాతంత్ర్యానంతరం నెహ్రూ ప్రభుత్వం రెండు చరణాలతోనే 'వందేమాతరం'ను జాతీయ గేయంగా ప్రకటించింది.

## భారత్‌ను అమెరికాకు అమ్మేశారు

- మొదటి పేజి తరువాయి

చేసుకుని విమర్శలు గుప్పించారు.

విదేశీ క్లౌడ్ సర్వీస్ ప్రొవైడర్లకు పన్ను రాయితీలు ఇవ్వడంపై రాహుల్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. "ఆర్థిక మంత్రి నవ్వుతున్నారు, ఆమెకు నవ్వడం అంటే చాలా ఇష్టం. పెద్ద టెక్ కంపెనీలకు 20 ఏళ్ల పాటు పన్ను మినహాయింపు ఇచ్చారు. మన డేటాతో మీరు చేసిందేమిటి?" అని ప్రభుత్వాన్ని నిలదీశారు. ఈ వాణిజ్య ఒప్పందం కింద టారిఫ్‌లలో చేసిన మార్పులు ఏకపక్షంగా అమెరికాకు మేలు చేసేలా ఉన్నాయని రాహుల్ ఆరోపించారు. "మొదట్లో మనపై సగటు టారిఫ్ 3 శాతం ఉండేది, ఇప్పుడు అది 18 శాతానికి పెరిగింది. అంటే ఆరు రెట్లు ఎక్కువ. అమెరికా నుంచి దిగుమతులు 46 బిలియన్ డాలర్ల నుంచి 146 బిలియన్ డాలర్లకు పెరుగుతాయి. కానీ మనకు వాళ్లు ఎలాంటి హామీ ఇవ్వలేదు. మనం మాత్రం వారికి కట్టుబడి ఉండాలి. వాళ్లపై మన టారిఫ్ 16 శాతం నుంచి సున్నాకి తగ్గింది, మనపై మాత్రం వాళ్ల టారిఫ్ 3 నుంచి 18 శాతానికి పెరిగింది" అని ఆయన గణాంకాలతో వివరించారు. ఈ ఒప్పందం వల్ల దేశంలోని టెక్స్‌టైల్ పరిశ్రమ పూర్తిగా నాశనమవుతుందని రాహుల్ ఆందోళన వ్యక్తం చేశారు. "అమెరికా బంగ్లాదేశ్‌పై సుంకాన్ని సున్నా శాతానికి తగ్గించింది, కానీ భారత్‌పై 18 శాతం విధిస్తోంది. మన టెక్స్‌టైల్ పరిశ్రమదారులు ఏం చేయాలి? వాళ్ల పోటీదారు బంగ్లాదేశ్. వాళ్లు అమెరికా కాటన్‌ను దిగుమతి చేసుకుంటే సున్నా డ్యూటీ. దీంతో మన టెక్స్‌టైల్ పరిశ్రమ పూర్తిగా నాశనమైపోతుంది" అని అన్నారు. అంతేకాకుండా, ఈ ఒప్పందం దేశ ఇంధన స్వాతంత్ర్యాన్ని దెబ్బతీస్తుందని రాహుల్ ఆరోపించారు. "ఇకపై మనం ఏ దేశం నుంచి చమురు కొనాలో అమెరికా నిర్ణయిస్తుంది, మన ప్రధానమంత్రి కాదు. వాళ్లు మనల్ని పర్యవేక్షిస్తారు. అమెరికాకు నచ్చని దేశం నుంచి భారత్ చమురు కొంటే, మనపై టారిఫ్‌లతో శిక్ష విధిస్తారు" అని విమర్శించారు. రైతుల ప్రయోజనాలను కూడా ప్రభుత్వం కాలరాస్తోందని, "పేద రైతులను అణచివేయడానికి తలుపులు తెరిచారు" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విమర్శల తీవ్రతను పెంచుతూ, "మీరు భారతదేశాన్ని అమ్మేశారని నేను చెబుతున్నాను. దేశాన్ని అమ్మడానికి మీకు సిగ్గుగా లేదా? మన తల్లి భారత్ మాతను అమ్మేశారు" అని రాహుల్ గాంధీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్రధానమంత్రి ఒత్తిడితోనే ఈ ఒప్పందానికి అంగీకరించారని ఆయన ఆరోపించారు. రాహుల్ వ్యాఖ్యలు లోక్‌సభలో తీవ్ర దుమారం రేపాయి.

## అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు: ఏపీ గవర్నర్ ప్రసంగం...


- మొదటి పేజి తరువాయి

ప్రభుత్వానికి అప్పగించారని గవర్నర్ గుర్తుచేశారు. "గత కొన్నేళ్ల ఆర్థిక ఒత్తిడి తీవ్ర అసమతుల్యతలను సృష్టించింది. అనేక రంగాల్లో గణనీయమైన అప్పులు పేరుకుపోయాయి. అయినా, ఆర్థిక వ్యవస్థను స్థిరీకరించడానికి, రుణ వ్యయాలను తగ్గించడానికి, విశ్వసనీయతను తిరిగి సంపాదించడానికి ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకుంది. స్వర్ణాంధ్ర దార్శనికతతో ముందుకు సాగుతున్నాం" అని ఆయన వివరించారు. ప్రభుత్వ ప్రయత్నాల ఫలితంగా రాష్ట్ర ఆర్థిక పనితీరు మెరుగుపడిందని గవర్నర్ తెలిపారు. "2025-26 మొదటి ముందస్తు అంచనాల ప్రకారం, ఆంధ్రప్రదేశ్ స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తి (+ూఙూ) గత ఏడాది రూ.15.91 లక్షల కోట్ల నుంచి రూ.17.62 లక్షల కోట్లకు పెరిగింది. ఇది 10.75 శాతం నామమాత్రపు వృద్ధి రేటును సూచిస్తోంది. రాష్ట్ర తలసరి ఆదాయం గతేడాది రూ.2.66 లక్షల నుంచి రూ.2.95 లక్షలకు పెరిగింది. వ్యవసాయ రంగంలో 7.83 శాతం, పరిశ్రమల రంగంలో 9.53 శాతం, సేవల రంగంలో 12.94 శాతం వృద్ధి సాధించాం" అని ఆయన గణాంకాలతో సహా వివరించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన దుష్పరిపాలనపై ప్రజలకు వాస్తవాలు తెలియజేసేందుకు ఏడు శ్వేతపత్రాలను విడుదల చేసినట్లు గవర్నర్ తన ప్రసంగంలో పేర్కొన్నారు. ప్రజాధనం దుర్వినియోగం, పోలవరం ప్రాజెక్టును పట్టాలు తప్పించడం, విద్యుత్ రంగం విధ్వంసం, సహజ వనరుల దుర్వినియోగం, అవినీతిమయమైన ఎక్సైజ్ విధానాలు, శాంతిభద్రతల క్షీణతతో పాటు భవిష్యత్ రాజధాని అమరావతిని నాశనం చేసే లక్ష్యంతో చేసిన మూడు రాజధానుల ప్రతిపాదన వంటి అంశాలను ఈ శ్వేతపత్రాల ద్వారా ప్రజల ముందు ఉంచామన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే 'సూపర్ సిక్స్' హామీలను నెరవేర్చడంపై దృష్టి సారించామని, క్రమంగా పాలనను పునరుజ్జీవనం నుంచి ఉన్నత స్థాయికి తీసుకెళ్లామని గవర్నర్ తెలిపారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్ అనే జాతీయ ఆకాంక్షలకు అనుగుణంగా, రాష్ట్రాన్ని 'సంపన్న, ఆరోగ్యకరమైన, సంతోషకరమైన'దిగా తీర్చిదిద్దడమే లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ పరివర్తన యజ్ఞంలో ప్రతి పౌరుడూ భాగస్వామి కావాలని ఆయన పిలుపునిచ్చారు. మన బలంపై విశ్వాసంతో, ఐక్య లక్ష్యంతో ఏపీ ముందుకు సాగుతోందని, ప్రతి పౌరుడూ గౌరవంగా, అవకాశాలతో జీవించే భవిష్యత్తుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని గవర్నర్ తన ప్రసంగాన్ని ముగించారు.




పెన్ పవర్
కాకినాడ
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

# పంచారామక్షేత్రం - సోమారామం - శ్రీ ఉమా సోమేశ్వర జనార్ధన స్వామి ఆలయం - భీమవరం





భక్తుల హృదయాలపై ఆధ్యాత్మిక పరిమళాలను వెదజల్లే సుప్రసిద్ధ పంచారామ క్షేత్రాలలో సోమారామం ఒకటి. దేశంలో ఉన్న స్పటికలింగాల్లో ఇది ఒకటి. రాజమండ్రికి 59 కి.మీ. దూరంలో, విజయవాడకు 91 కి.మీ. దూరంలో ఉన్న పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం పట్టణానికి 2 కి.మీ. దూరంలో ఉన్న గుణిపూడిలో కలదు. ఇక్కడి లింగమును చంద్రుడు ప్రతిష్ఠించాడని స్థలపురాణంలో చెప్పబడింది. చంద్రుని పేరున దీనిని సోమేశ్వరక్షేత్రమని పిలుస్తారు. ఇక్కడ ప్రతీ కార్తీకమాసంలో బ్రహ్మాండమైన ఉత్సవాలు జరుగుతాయి. భక్త సులభుడైన శివయ్య ఇక్కడ సోమేశ్వరస్వామి పేరుతో నిత్య పూజలందుకుంటూ ఉంటాడు. దేవాలయంలో ఉన్న శివలింగం అమావాస్య నాడు నలుపు వర్ణంలోను, పౌర్ణమి రోజున గోధుమ వర్ణంలో దర్శనమివ్వడం ఈ ఆలయ ప్రత్యేకత. చంద్రుడు ప్రతిష్టించిన కారణంగానే, ఆయనని అనుసరిస్తూ ఈ శివలింగం రంగుమారుతూ ఉంటుందని చెబుతుంటారు. ఇది శతాబ్దకాలంగా జరుగుతోందని ఇక్కడి పూజారులు చెబుతున్నారు. ఈ మార్పులను గమనించాలంటే అమావాస్యతో పాటు పౌర్ణమి రోజున దేవాలయాన్ని సందర్శించాల్సి ఉంటుంది. ఈ ఆలయం రెండు అంతస్తులుగా ఉంటుంది. సోమేశ్వరుడు కింది అంతస్తులోనూ, పక్కన పార్వతి దేవి అమ్మవారు ,అన్నపూర్ణాదేవి పై అంతస్తులోనూ ఉంటారు. ఇలా శివుడి పైన అమ్మవారు ఉండటం దేశంలో మరెక్కడా లేదని చెబుతారు. ఈ ఆలయానికి క్షేత్రపాలకుడు జనార్ధన స్వామి. దేవాలయం ముందు భాగంలో రెండు నందులు ఉండగా ధ్వజస్తంభం వద్ద మరో నంది ఉంటుంది. అటుపై ఆలయ ప్రాంగణంలో ఒక నంది, దేవాలయం ఎదురుగా ఉన్న చంద్ర పుష్కరిణిలో మరో నంది ఉంటుంది. అందువల్లే ఈ క్షేత్రానికి పంచనందీశ్వర దేవాలయం అని కూడా పేరు.

దేవాలయం ముందున్న రాతి గట్టు నుంచి చూస్తే శివలింగానికి బదులు అన్నపూర్ణాదేవి కనిపిస్తుంది. ఈ క్షేత్రంలోని చంద్ర పుష్కరిణిలో స్నానం చేస్తే పాపాలు పటాపంచలవుతాయని విశ్వసిస్తూ వుంటారు. చతుర్ధ చాళుక్యరాజైన చాళుక్య భీముడు ఈ దేవాలయాన్ని మూడో శతాబ్దంలో నిర్మించాడు. ఈ దేవాలయానికి ప్రాకారాలను, గోపురాన్ని నిర్మించాడనడానికి చారిత్రక ఆధారాలు కనిపిస్తున్నాయి. అందువల్లే ఈ క్షేత్రానికి భీమారామం అనే పేరు కూడా ఉంది. ప్రతి ఏడాది ఇక్కడ మహా శివరాత్రి సందర్భంగా స్వామివారి కళ్యాణోత్సవాలు అయిదు రోజులపాటు జరుగుతాయి. అలాగే దేవీనవరాత్రులు కూడా ఎంతో వైభవంగా నిర్వహిస్తుంటారు.



**సేకరణ డి.వి.ఆర్. జీ.వి. రత్నం- స్టాఫ్ రిపోర్టర్**

# జిఎస్టి, వాణిజ్య పన్నుల వసూళ్ల కు కార్యాచరణ

**✷ జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్**

**అమలాపురం/అంబాజీపేట, పెన్ పవర్, ఫిబ్రవరి 11** :డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో జిఎస్టి, వాణిజ్య పన్నుల వసూళ్ల కు సంబంధించి కీలక కార్యాచరణ అమలు చేస్తూ అదీకృతంగా ప్రభుత్వానికి రావలసిన ఆదాయాన్ని సమకూర్చడంలో అధికారులు కీలకంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ ఆదేశించారు .ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇక పై ప్రతి నెల జిల్లా స్థాయి అధికారులతో జీఎస్టీ పన్నుల వసూలపై సమావేశం నిర్వహించి పురోగతిపై సమీక్షించడం జరుగు తుందన్నారు. జిల్లా స్థాయిలో వాణిజ్య పన్నులు జిఎస్టి పన్నులకు సహాయ పడేలా ప్రతి శాఖకు వాణిజ్య పన్నుల శాఖ ఒక ఫార్మేట్ ను రూపొందించి సమర్పిస్తారని ఆ ప్రకారం తమతమ శాఖలలో కార్యకలాపాలకు సంబంధించి పన్నులు వసూళ్లు ,వివరాలు నింపి నివేదిక సమర్పించాలని సూచిం చారు. ఈ నెల తొమ్మిదో తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఈ విషయాన్ని చర్చించడం జరిగిందన్నారు. జిల్లా వాణిజ్య పన్నుల వసూళ్లకు సంబంధించి కీలక కార్యాచరణ అమలు చేయాలని ఆదేశించారు. సి టి డి గనులు, భూగర్భ శాస్త్రం, పౌర సరఫరాలు పోలీసులతో జాయింట్ టాస్క్ ఫోర్సు బృందాలను పెండింగ్ బకాయిల వసూళ్ల కొరకు నియమిం చాలన్నారు. సబ్ రిజిస్ట్రర్లు బకాయి డిఫాల్టర్ల ఆస్తుల గుర్తింపు, పరాయీకరణకు అవసరమైన అనుమతులు జారీ చేయాలని సూచించారు. అదేవిధంగా వేలం నిర్వహణ అటాచ్ మెంట్‌లను అమలు చేయడానికి బ్యాంకర్ల కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. సబ్ రిజిస్ట్రార్లను త్వరగా ఈ సీ సర్టిఫికెట్లు జారీ చేయాలని, డిఫాల్టర్ల ఆస్తుల బదిలీని నిలిపివేయాలని, వేలం నిర్వహించడంలో సహాయం అందించాలన్నారు. రికవరీలకు పోలీసుల సహకారం, లైసెన్సులు పునరుద్ధరణలు జారీ చేసేటప్పుడు ఓటిసిఎస్ సమ్మతిని తనిఖీ చేయా లని అన్ని లైన్ విభాగాలకు సూచించారు. జీఎస్టీ రేటు హేతుబద్ధీకరణ ప్రయోజనాల అమలులో లీగల్ మెట్రాలజీ మద్దతును కోరాలన్నారు ,పౌర సరఫరాల నుండి డేటా భాగస్వామ్యం అన్నిడి డి ఓ లు జిఎస్టి కింద టీ డీ ఎస్ డిడక్టర్లు గా నమోదు చేసుకున్నారో లేదో నిర్ధారించాలన్నారు. వ్యాట్ లీకేజీని అరికట్టడానికి కాంట్రాక్టర్లు స్థానికంగా సామాగ్రిని, ముఖ్యంగా పిఓఎల్‌లను కొనుగోలు చేసేలా అమలు చేయాలన్నారు.వృత్తి పన్ను చెల్లింపుదారులను గుర్తింపు, బకాయిల వసూళ్లకు కృషి చేయాలన్నారు. నెలవారి సమావేశాలు సిటిడి గనులు, భూగర్భ శాస్త్రం, పౌర సరఫరాలు, పోలీ సులతో జాయింట్ టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేసి పన్ను జీఎస్టీ వస్తువులు లలో కీలకంగా వ్యవహరించి ప్రభుత్వానికి నిధులు రాబట్టాలన్నారు. డిఫాల్టర్ల ఆస్తులను గుర్తించి, అను మతులు జారీ చేసి వేలం నిర్వహణ, అటాచ్‌మెంట్‌లు అమలు చేయాలని. డి ఆర్ సి 13 ప్రకారం బ్యాంకర్ల కమిటీని ఏర్పాటు చేయా లన్నారు. రికవరీలకు పోలీసుల సహాయం తీసుకోవాలన్నారు.



లైసెన్సులు, పునరుద్ధరణ లు జీఎస్టీ రేటు హేతుబద్ధీకరణ లీగల్ మెట్రాలజీ మద్దతుతో ప్రయోజనాలను అమలు చేయాలన్నారు. ప్రతిపాదిత అంశాలను జిల్లా స్థాయిలో తక్షణమే అమలు చేసి, పురోగతిని సాధిస్తూ ప్రభుత్వానికి రావలసిన పన్నులను రాబట్టి రాష్ట్ర ఆదాయాలను పెంచడంలో కీలకంగా వ్యవహరించాల న్నారు .కాంట్రాక్టర్లు వ్యాట్ చెల్లించని పక్షంలో వారి సెక్యూరిటీ డిపాజిట్ నుండి రికవరీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ కే మాధవి ఆర్డిఓ లు పి శ్రీకర్, డి అఖిల, వాణిజ్య పన్నుల శాఖ డిప్యూటీ కమిషనర్ ముత్యాలరావు, అసిస్టెంట్ కమిషనర్ జగన్ మోహన్ రెడ్డి, ఎల్డిఎం కేశవ వర్మ, డిఎస్ఓ ఉదయ భాస్కర్ జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు

# భక్తిశ్రద్ధలతో చక్రస్నానం

**కల్పవృక్ష వాహనంపై కళ్యాణ వేంకటేశ్వరునిగా పురవిహారం చేసిన శ్రీనివాసుడు.**



**ఆలమూరు, పెన్ పవర్, ఫిబ్రవరి 11;**చింతలూరు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి పాంచాహ్నిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రద్ధోత్సవం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారి చక్రస్నానం నిర్వహించారు. చక్రస్నానానికి విశేష సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. అనంతరం అన్నప్రసాద వితరణ జరిపారు. సాయంత్రం స్వామివారు శ్రీదేవి, భూదేవి సమేతుడై కళ్యాణ వేంకటేశ్వరునిగా కల్పవృక్ష వాహనంపై పుర విహారం చేశారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## జొన్నాడలో దీన్ దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతి



**ఆలమూరు పెన్ పవర్ ఫిబ్రవరి11:**ఆలమూరు మండలం జొన్నాడ గ్రామంలోబుధవారం పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ 58వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు మేడపాటి వెంకటకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి అయినవిల్లి సత్తిబాబు గౌడ్ మాట్లాడుతూ, ఏకాత్మ మానవతావాద సిద్ధాంతం ద్వారా అట్టడుగు వర్గాల అభ్యున్నతిని లక్ష్యంగా పెట్టుకున్న మహనీయుడు దీన్ దయాళ్ ఉపాధ్యాయ అని కొనియాడారు. సమగ్ర మానవతావాదం, వికేంద్రీకృత రాజకీయ వ్యవస్థ, స్వావలంబన ఆర్థిక విధానాలు గ్రామాభివృద్ధికి మూలస్థంభాలుగా ఆయన ప్రతిపాదించారని తెలిపారు. పాశ్చాత్య భావజాలాలపై ఆధారపడకుండా భారతీయ సంస్కృతి, సంప్రదాయాల ఆధారంగా దేశం అభివృద్ధి చెందాలని ఉపాధ్యాయ ఆశయమని పేర్కొన్నారు. ఆయన సిద్ధాంతాలను ప్రేరణగా తీసుకుని ప్రధాని నరేంద్ర మోదీ దేశాభివృద్ధికి కృషి చేస్తున్నారని అన్నారు

## వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయంలో విశిష్ట పూజలు

* నిత్య అన్నదాన పథకానికి భక్తులు విరాళం





**ఆత్రేయపురం పెన్ పవర్ ఫిబ్రవరి11:**వాడపల్లి శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ సన్నిధిలో బుధవారం విశిష్ట పూజా కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. స్వామివారి వసంత మండపంలో అష్టోత్తర శతనామార్చన, నిత్య కళ్యాణం కార్యక్రమాలు జరగగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయంలో నిర్వహిస్తున్న నిత్య అన్నదాన ప్రసాదాన్ని కూడా భక్తులు స్వీకరించారు.

ఈ సందర్భంగా భీమవరం, కొవ్వాడ అన్నవరం గ్రామానికి చెందిన గొడవర్తి సుబ్రహ్మణ్యంవెంకట శిరీష దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి రూ. 51,116 విరాళం అందజేశారు. అలాగే రాజమండ్రి అన్నపూర్ణమ్మపేటకు చెందిన శ్రీనివాస్ఉష దంపతులు రూ. 25,000 విరాళం సమర్పించారు. దాతలను ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించగా, ఆలయ సూపరింటెండెంట్ పులపర్తి రాంబాబు, అసిస్టెంట్ అధికారి నందీశ్వరుడు స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.

## ఆత్మ పథకం కింద నానో ఎరువులపై రైతులకు శిక్షణ



**కాజులూరు, ఫిబ్రవరి 11 ,పెన్ పవర్:**వ్యవసాయ ఖర్చులు పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో తక్కువ వ్యయంతో అధిక దిగుబడులు సాధించేందుకు నానో ఎరువులు రైతులకు ఎంతగానో ఉపయోగపడతాయని మండల వ్యవసాయ అధికారి వి. అశోక్ అన్నారు. బుధవారం కాజులూరు మండల కేంద్రంలో ఆత్మ పథకం కింద నానో ఎరువుల వినియోగంపై రైతులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నానో సాంకేతికతతో తయారు చేసే సూక్ష్మ పరిమాణంలోని ఎరువులు మొక్కలకు అవసరమైన పోషకాలను నేరుగా, సమర్థ వంతంగా అందిస్తాయని తెలిపారు. సాధారణ ఎరువులతో పోలిస్తే తక్కువ పరిమాణంలోనే ఎక్కువ ప్రభావం చూపుతాయని, ఒక బస్తా యూరియాకు బదులుగా చిన్న పరిమాణం నానో యూరియా సరిపోతుందని వివరించారు. దీని వల్ల రవాణా, నిల్వ ఖర్చులు తగ్గుతాయని చెప్పారు. సహకార సంఘ అధ్యక్షుడు యాళ్ళ వెంకటరమణ మాట్లాడుతూ సరైన సమయంలో నానో ఎరువులు వినియోగిస్తే పంటల పెరుగుదల మెరుగై దిగుబడి 8 నుంచి 15 శాతం వరకు పెరిగే అవకాశం ఉందన్నారు. పర్యా వరణానికి హానికరమైన రసాయన ఎరువుల వినియోగం తగ్గడంతో నేల, నీటి కాలుష్యం కూడా తగ్గుతుందని పేర్కొన్నారు. ఇఫ్కో సేల్స్ ఆఫీసర్ శ్యామ్ మాట్లాడుతూ నానో ఎరువుల వల్ల నేల ఆరోగ్యం మెరుగుపడి, పంట నాణ్యత పెరుగుతుందని, దీర్ఘకాలంలో స్థిరమైన వ్యవసాయం సాధ్యమవుతుందని తెలిపారు. ఆత్మ కమిటీ డైరెక్టర్ వెలుగుబంట్ల శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ భవిష్యత్తులో నానో సాంకేతికత ఆధారిత వ్యవసాయం మరింత విస్తరిస్తూ రైతుల ఆదాయాన్ని పెంచడంలో కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షుడు యాళ్ళ సత్యనారాయణ, వ్యవసాయ విస్తరణ అధికారులు ప్రశాంత్, శ్రీనివాస్ వర్మ, వ్యవసాయ శాఖ సహాయకులు సౌమ్య, సత్య, సాహిత్యతో పాటు రైతులు, కౌలు రైతులు పాల్గొన్నారు.

# ప్రత్యేక అవసరాల పిల్లలు అద్భుతాలను సృష్టించగలరు



* జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్

**అమలాపురం/అంబాజీపేట, పెన్ పవర్, ఫిబ్రవరి 11 :**డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక అవసరాలు గల పిల్లలు ప్రత్యేక విభిన్న ప్రతిభలు కలిగి ఉంటారని వారికి సరైన వేదికను ప్రోత్సాహం మార్గదర్శకత్వం అందిస్తే వారు అద్భుతాలను సృష్టించగలరని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ తెలిపారు. బుధవారం స్థానిక అంబేద్కర్ భవన్ నందు పాఠశాల విద్యాశాఖ సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో సహిత విద్యా విభాగం ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఈనెల 11, 12 తేదీలలో నిర్వహించనున్న జిల్లాస్థాయి ఆర్ట్స్ కల్చరల్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీలు ప్రత్యేక అవసరాలుగల దివ్యాంగుల సృజ నాత్మకత, ఆత్మవిశ్వాసం మరియు ప్రతిభను వెలికితీసే ఒక మంచి అవకాశంగా నిలుస్తాయన్నారు.

పాఠశాల విద్యాశాఖ సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో సహిత విద్యా విభాగం నిర్వహిస్తున్న ప్రత్యేక అవసరాలు గల పిల్లల జిల్లాస్థాయి ఆర్ట్స్, కల్చరల్ పోటీలను ప్రారం భించడం నాకు ఎంతో ఆనందంగా ఉందన్నారు .ప్రత్యేక అవసరాలు గల పిల్లలు ప్రత్యేక విభిన్న ప్రతిభా పాటవాలు కలిగి ఉంటారని వారిని అన్ని విధాలుగా ప్రోత్సహిస్తే వారికి ఉన్న రిజర్వేషన్ల ద్వారా ఉన్నత శిఖరాలు అధిరోహించేందుకు అవకాశాలు మెరుగు పడతాయన్నారు. సమగ్ర శిక్ష లక్ష్యం ప్రతి బాలుడికి సమాన విద్యా అవకాశాలు కల్పించడశీ ద్వారా సహిత విద్యా విభాగం చేస్తున్న కృషి ప్రశంసనీయమ న్నా రు. ఈ కార్యక్రమం ద్వారా పిల్లలలో సామాజిక చైతన్యం పెంపొంది, వారి సామర్థ్యాలు మెరుగు పడతాయన్నారు. ఈ పోటీలలో పాల్గొంటున్న ప్రతి విద్యార్థి విజేతేనని గెలుపు ఓటములు కేవలం ఫలితాలే కానీ పాల్గొనడం, ప్రతిభ ప్రదర్శించడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్ర మం విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ, పోటీలను అధికారికంగా ప్రారంభించా మన్నారు. కళలు వ్యక్తిత్వ వికా సానికి ఒక గొప్ప సాధన మని ఇవి భావ వ్యక్తీకరణకు మార్గం చూపుతాయన్నారు. డి ఆర్ ఓ కే మాధవి ప్రసంగిస్తూ విభిన్న ప్రతి భావంతులలో అపారమైన ప్రతిభ దాగి ఉంటుందని బాధ్యత వారిని అర్థం చేసుకుని, ప్రోత్సహించి, సమాన అవకాశాలు కల్పిస్తూ సమాజంలో ప్రతి బాలుడిని సమానంగా చూడాలన్నారు. ఈ పోటీల ద్వారా పిల్లలలో ధైర్యం, సృజనాత్మకత ఆత్మగౌర వం పెంపొందాలని ఆశిస్తు న్నాను. పోటీలలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ఆయన శుభా శీస్సులు శుభాకాంక్షలు తెలిపారు. సమగ్ర శిక్ష మరియు సహిత విద్యా విభాగానికి అభినందనలు తెలియజేస్తూ, ఈ కార్యక్ర మం విజయవంతం కావా లని ఆకాంక్షించారు. ఆత్మవిశ్వాసం, ధైర్యం, కృషి ప్రతిఒక్క వ్యక్తికి ప్రేరణనిస్తాయన్నారు ఈ పోటీల ద్వారా జిల్లా యొక్క ప్రతిభను ప్రపం చానికి చాటి చెప్పాలన్నా రు. ఈ పోటీలు విశ్వాసా న్ని పెంచి, సామాజిక సమై క్యతకు మార్గాన్ని తెరుస్తా యన్నారు. ఈ కార్యక్రమం లో సమగ్ర శిక్ష ఏపీసి జి మమ్మీ విద్యాశాఖ అధికా రులు తదితరులు పాల్గొ న్నారు

## పండిట్ దీన్ దయాల్ దేశానికి అందించిన సేవలు మరువలేనివి.



**-మండల బిజెపి అధ్యక్షుడు శరకణం రాజబాబు.**

**కిర్లంపూడి, పెన్ పవర్,ఫిబ్రవరి11:** పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ దేశానికి అందించిన సేవలు మరువలేనివని కిర్లంపూడి మండలం భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు శరకణం రాజబాబు అన్నారు.

కాకినాడ జిల్లా బిజెపి అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వరరావు ఆదేశాలతో, కాకినాడ జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి, జగ్గంపేట నియోజకవర్గ ఇన్చార్జి దాట్ల కృష్ణ వర్మ పర్యవేక్షణలో, కిర్లంపూడి మండలం బిజెపి అధ్యక్షులు శరకణం రాజబాబు ఆధ్వర్యంలో కిర్లంపూడి మండలం జగపతినగరం గ్రామంలో రాజు గారి ఆస్పటల్ దగ్గర పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ సమర్పణ దివాస్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్బంగా రాజుబాబు మాట్లాడుతూ పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ భారత రాజకీయాల్లో ముఖ్యంగా ఏకాత్మ మానవతావాదం అనే సిద్ధాంతాన్ని ప్రపంచానికి పరిచయం చేసిన గొప్ప దర్శనీకుడు, భారత రాజకీయ తత్వవేత్త, సంఘ సంస్కర్త, గొప్ప మేధావి అన్నారు. ఆయన భారతీయ జన సంఘ అధ్యక్షుడుగా పనిచేసి,మానవుని శారీరక, మానసిక, ఆధ్యాత్మిక అంశాల మధ్య సమతుల్యాన్ని సాధించాలని బోధించారన్నారు.. సమాజంలో చిట్టచివరి వ్యక్తికి కూడా ఫలాలు అందాలన్నదే ఆయన లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో మండలం ఎంపీటీసీల సమైక్య అధ్యక్షులు, బిజెపి నాయకులు అల్లు శివరామ కృష్ణ ,కాకినాడ జిల్లా ఓబిసి అధ్యక్షులు కంటా కాశీ విశ్వనాధం, తామరాడ ఎంపీటీసీ మెంబర్, జనసేన నాయకులు గోకేడ రాజబాబు, ఉపాధ్యక్షులు కోనేటి శ్రీనివాస్ రావు, బుద్ధ పెద్దకాపు, శరకణం కన్నారావు, మండలం ఓబిసి అధ్యక్షులు పెంటకోట సత్యనారాయణ, మారిశెట్టి త్రిమూర్తులు, దాడి వెంకటేష్, ఏసుబాబు, బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కుండలేశ్వరంలో మహా శివరాత్రి ఏర్పాట్లను సమీక్షించిన ఆర్.డి.వో మాధవి



**కాట్రేనికోన పెన్ పవర్ ఫిబ్రవరి 11**:డా. బి. ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలంలోని ప్రముఖ శైవక్షేత్రం కుండలేశ్వరంలో రానున్న మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా ఏర్పాట్లను అమలాపురం ఆర్డీవో మాధవి పరిశీలించారు. ఆలయ ప్రాంగణం, స్నానాల రేవు, భక్తుల రాకపోకలకు సంబంధించిన మార్గాలు, పార్కింగ్ ప్రాంతాలు వంటి ప్రధాన ప్రాంతాలను ఆమె సందర్శించి పరిస్థితిని అంచనా వేశారు. మహాశివరాత్రి పర్వదినం రోజున కుండలేశ్వర స్వామి వారిని దర్శించుకునేందుకు సుమారు లక్షమంది వరకు భక్తులు తరలివచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్న నేపథ్యంలో, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆర్డీవో మాధవి ఆదేశించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా క్రమబద్ధమైన దర్శన ఏర్పాట్లు, తాగునీటి సదుపాయం, క్యూలైన్ల నిర్వహణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ప్రత్యేకంగా స్నానాల రేవు వద్ద భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున, భద్రతా చర్యలు కట్టుదిట్టంగా ఉండాలని ఆమె తెలిపారు. ఈ నేపథ్యంలో గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచడంతో పాటు, పడవలను కూడా ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన సూచనలు ఇచ్చారు. ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా నిరంతర పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అలాగే పారిశుద్ధ్యం విషయంలో నిర్లక్ష్యం అసలు సహించబోమని హెచ్చరించిన ఆర్డీవో, ఆలయ పరిసరాలు, రేవు ప్రాంతం, అన్నదానం జరిగే ప్రదేశాల్లో స్వచ్ఛతను కచ్చితంగా పాటించాలని అధికారులకు సూచించారు. చెత్త సేకరణకు ప్రత్యేక బృందాలను నియమించి, తాత్కాలిక మరుగుదొడ్లు, తాగునీటి ట్యాంకులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ట్రాఫిక్ నిర్వహణ, వైద్య శిబిరాలు, అత్యవసర సేవలు, పోలీసు బందోబస్తు వంటి అంశాలపై కూడా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని ఆమె అధికారులకు తెలిపారు. భక్తులు సురక్షితంగా, సౌకర్యవంతంగా మహాశివరాత్రి ఉత్సవాలను జరుపుకునేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆర్డీవో మాధవి స్పష్టం చేశారు. తసిల్దార్ రవి కిరణ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మత్స్యకార కార్పొరేషన్ మాజీ చైర్మన్ నాగిడి నాగేశ్వర రావు డీసీ చైర్మన్ ఆకాశం శ్రీనివాస్,మార్గదర్శి త్సవటపల్లి నాగేంద్ర రావు నాయకులు దంద్రుప్రోలు సత్యం బొమ్మిడి లింగేశ్వర రావు పీఎస్ ఎన్ రాజు, గంగమల్ల వీరభద్ర రావు,ఎంపీడీవో బి రాజేశ్వర రావు, సిఐ ఎం మోహన్ కుమార్,

ఎస్ ఐ అవినాష్ ఏఈలు శ్రీనివాస్ సుబ్రహ్మణ్యం రమేష్, వైద్యాధికారి పి నీలిమ కుండలేశ్వరం దేవస్థానం ఈవో కొర్లపాటి సూర్య వెంకట దుర్గా సొసైటీ చైర్ పర్సన్ గంగమల్ల

రవి కుమార్,డిప్యూటీ ఎంపీడీవో నున్న శంకర్ నారాయణ,గ్రామ పంచాయతీ కార్యదర్శి ఆర్ కే దుర్గా, తదితరులు పాల్గొన్నారు

## రబీ సీజన్‌కు సరిపడా యూరియా అందుబాటులో ఉంది జిల్లా వ్యవసాయ అధికారి

**కాకినాడ, పెన్ పవర్, ఫిబ్రవరి 11:**కాకినాడ జిల్లాలో దాళ్వా (రబీ) 202526 సీజన్‌కు అన్ని రకాల పంటలకు అవసరమైన యూరియా సరఫరా సంతృప్తికరంగా ఉందని జిల్లా వ్యవసాయ అధికారి తెలిపారు. జిల్లాలో మొత్తం 35,576 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండగా,ఫిబ్రవరి 2026 వరకు 32,613 మెట్రిక్ టన్నుల అవసరానికి గాను ఇప్పటివరకు 27,141 మెట్రిక్ టన్నులు సరఫరా చేసినట్లు వెల్లడించారు. 11-02-2026 నాటికి జిల్లాలో మొత్తం 3,967 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

ప్రస్తుతం ప్రైవేట్ రిటైల్ డీలర్ల వద్ద 2,155 మెట్రిక్ టన్నులు, పీఏసీఎస్‌ల వద్ద 447 మెట్రిక్ టన్నులు, రైతు సేవ కేంద్రాలలో 1,186 మెట్రిక్ టన్నులు, ప్రైవేట్ హోల్‌సేల్ డీలర్ల వద్ద 42 మెట్రిక్ టన్నులు, ఏపీ మార్క్‌ఫెడ్ వద్ద 138 మెట్రిక్ టన్నులు ఉండటంతో మొత్తం 3,967 మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాలో అందుబాటులో ఉందని తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు ఎటువంటి ఎరువుల కొరత లేదని, రాబోయే పంట కాలంలో కూడా యూరియాకు ఇబ్బంది ఉండదని స్పష్టం చేశారు. ఈ రోజు ఆర్‌ఎఫ్‌సీఎల్ రేక్ ద్వారా జిల్లాకు 1,132 మెట్రిక్ టన్నుల యూరియా చేరిందని, అవసరమైన మండలాలకు డీలర్లు, పీఏసీఎస్‌లు, రైతు సేవ కేంద్రాలకు సరఫరా చేస్తామని తెలిపారు. రైతులు ఎరువులు కొనుగోలు చేసే సమయంలో బస్తాలపై ముద్రించిన ఎంఆర్‌పీ ధరలనే చెల్లించి, తప్పనిసరిగా రసీదు తీసుకోవాలని సూచించారు. అలాగే సాంకేతికంగా అభివృద్ధి చెందిన నానో యూరియా,నానో డీఏపీ ఎరువులు జిల్లాలో అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. ప్రస్తుతం రైతు సేవ కేంద్రాలలో 616 లీటర్ల నానో యూరియా నిల్వలు ఉన్నాయని పేర్కొన్నారు. ఇవి సాంప్రదాయ ఎరువులకు ప్రత్యామ్నా యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయని తెలిపారు. నిబంధ నలు ఉల్లంఘిస్తూ ఎవరైనా డీలర్లు ఎరువుల కృత్రిమ కొరత సృష్టించినా, మళ్లింపు చేసినా లేదా ఎంఆర్‌పీ కంటే అధిక ధరలకు విక్రయించినా వారి లైసెన్సులు రద్దు చేసి, ఎరువుల నియంత్రణ చట్టం1985 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## గండేపల్లి లో ప్రభుత్వం పూర్తి సబ్సిడీతో అందించిన ఎగ్ కార్ట్ దుకాణాన్ని ప్రారంభించిన గ్రామ టిడిపి అధ్యక్షులు బొల్లంరెడ్డి రామకృష్ణ





**గండేపల్లి పెన్ పవర్, ఫిబ్రవరి 11:** డి ఆర్ డి ఎ సెర్ప్ నుండి ఎగ్ కార్ట్ దుకాణం గండేపల్లి గ్రామానికి చెందిన కటకం ధనలక్ష్మి కు నూరు శాతం సబ్సిడీతో మంజూరైన వ్యాపార దుకాణాన్ని గండేపల్లి గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బొల్లంరెడ్డి రామకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ సహకారంతో కూటమి ప్రభుత్వం పేదవారికి అండగా ఉంటుందని పూర్తి సబ్సిడీతో ఎగ్ కర్ట్ దుకాణాన్ని అందించి ఒక కుటుంబనాకి జీవనోపాధి కలుగుతుందని తెలియజేశారు. తెలుగుదేశం పార్టీ ఎన్నో వినూత్న కార్యక్రమాలు రూపొందిస్తున్నారని ఆదరణ పథకం, చేయూత పథకం, వంటి పథకాలతో పేదలను ఆదుకుంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం సన్యాసిరావు, రాజు, బూసమ్మ, పద్మ,వెంపాటి రాజు, ఆళ్ల సత్తిబాబు, పోతుల బుల్లి దొర,ముంగర సూర్యారావు, రెడ్డి సుబ్బారావు, ఇనుప కోళ్ల సంజీవయ్య, పైల వెంకన్న, పెనుగాడి నాగరాజు, వెంపాటి రాంబాబు, ఉండవల్లి గోపి, సానిపినీ తాతారావు, యాక పరదేశి నాయుడు, పైల రమణ, గునిపిల్లి వీరబాబు, గరికిపాటి రమణ, కటకం సత్యనారాయణ, సత్యవరపు మురళి, కొత్త సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఆదిత్య యూనివర్సిటీలో వర్క్‌షాప్ ప్రారంభం

**గండేపల్లి, పెన్ పవర్, ఫిబ్రవరి, 11:**గండేపల్లి మండలం సూరంపాలెం: ఆదిత్య యూనివర్సిటీ లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అన్ని విభాగాల విద్యార్థుల కోసం 'ఏ.ఐ. ఫర్ ఎవరీ వన్" అనే ప్రత్యేక వర్క్‌షాప్ ఘనంగా ప్రారంభమైందని యూనివర్సిటీ డిప్యూటీ ప్రో–చాన్సలర్ డా. ఎం. శ్రీనివాస రెడ్డి తెలిపారు. కృత్రిమ మేధస్సు పై ప్రాథమిక అవగాహన కల్పిస్తూ, విద్యార్థుల భవిష్యత్ సాంకేతిక అవసరాలకు సిద్ధం చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ వర్క్‌షాప్ ద్వారా ఏ.ఐ. యొక్క మౌలిక సూత్రాలు, మెషిన్ లెర్నింగ్, డేటా ఆధారిత నిర్ణయాలు, రోజువారీ జీవితంలో ఏ.ఐ వినియోగం వంటి అంశాలపై సులభంగా అర్థమయ్యే విధంగా శిక్షణ అందించబడుతుంది అని నిర్వాహకులు తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానం లేని విద్యార్థులు కూడా సులభంగా అర్థం చేసుకునే విధంగా ఉదాహరణలు, ప్రత్యక్ష ప్రదర్శన మరియు వాస్తవ జీవిత అనువర్తనాలు ద్వారా శిక్షణ అందించనున్నట్లు వారు తెలిపారు. స్మార్ట్ అసిస్టెంట్లు, చాట్‌బాట్స్, రికమెండేషన్ సిస్టమ్స్, హెల్త్‌కేర్, ఎడ్యుకేషన్ మరియు ఇండస్ట్రీలలో ూ× పాత్ర వంటి అంశాలను నిపుణులైన వనరుల వ్యక్తి మొహమ్మద్ సర్దార్ సాజిత్ విద్యార్థులకు వివరించనున్నారు. ఈ ప్రారంభ కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్–చాన్సలర్ డా. ఎం.బి. శ్రీనివాస్, ప్రో వైస్–చాన్సలర్ డా. ఎ. రమేష్, ప్రో వైస్–చాన్సలర్ డా. ఎస్. రమా శ్రీ, ఫ్రెష్‌మన్ విభాగం అసోసియేట్ డీన్ డా. ఎ. వానతి, ఫ్రెష్‌మన్




ఇంజనీరింగ్ విభాగాధిపతులు డా. పి సతీష్, డా. సిహెచ్. రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పొ. 12 సెం.మీ. వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## ఆర్థిక అక్షరాస్యతతోనే సరైన ఆర్థిక నిర్ణయాలు



**– జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్**

**అమలాపురం/అంబాజీపేట, పెన్ పవర్, ఫిబ్రవరి 11:** భారతీయ రిజర్వ్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 9 నుంచి 13వ తారీకు వరకు నిర్వహిస్తున్న ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ వెల్లడించారు. బుధవారం ఈ మేరకు వారోత్సవాల ప్రచార గోడ పత్రికను ఆయన చాంబర్ నందు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక అక్షరాస్యతతోనే సరైన ఆర్థిక నిర్ణయాలు తీసుకో గలుగుతారన్నారు. భారతీయ రిజర్వ్ బ్యాంక్ ఆధ్వర్యంలో ( =దీ×) ఫిబ్రవరి 9 నుంచి 13వ తారీకు వరకు నిర్వహిస్తున్న ఆర్థిక అక్షరాస్యత వారోత్సవం సందర్భంగా ప్రజల్లో ఆర్థిక అంశాల పట్ల సమగ్రమైన అవగాహనను వారం రోజులపాటు విస్తృత ప్రచారం ద్వారా పెంపొందిం చాలన్నారు ప్రజలు సరైన ఆర్థిక నిర్ణయాలు తీసుకోవడంలో ఆర్థిక అక్షరాస్యత కీలకపాత్ర పోషి స్తుందని పేర్కొన్నారు. సురక్షిత బ్యాంకింగ్ విధానాలు పాటించడం, డిజిటల్ లావాదేవీలు జాగ్రత్తగా నిర్వహించడం, పొదుపు అలవాట్లు పెంపొందించుకోవడం, ఆర్థిక మోసాల నుంచి రక్షణ పొందడం, ఇకేవైసీ చేయించడం అలాగే సెంట్రలైజ్డ్ కేవైసీ రిజిస్ట్రీ మరియు బ్యాంకు డిపాజిట్ల పైన ప్రజల్లో అవగాహన కల్పించాల న్నారు. .అలాగే ఈ వారోత్సవం ద్వారా సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు బాధ్యతాయుత మైనటువంటి ఆర్థిక ప్రవర్తన పైన అవగాహన కల్పించడం,డిజిటల్ బ్యాంకింగ్ సేవలు, ఆన్లైన్ మోసాలు, ఆన్లైన్ నేరాలు, సైబర్ సెక్యూరిటీ ఇన్సూ రెన్స్, పెన్షన్ పథకాల పైన అవగాహన కల్పించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా లీడ్ బ్యాంకు మేనేజ ర్ కేశవ వర్మ పాల్గొన్నారు.

## కిర్లంపూడి పోలీసులకు యూనిఫామ్ డ్రెస్సులు బహుకరించిన బొదిరెడ్ల.




**–అభినందించిన సిఐ వై.ఆర్.కె శ్రీనివాస్,ఎస్సై జి సతీష్**

**కిర్లంపూడి,పెన్ పవర్,ఫిబ్రవరి 11**:ప్రజా భద్రత కోసం నిత్యం అంకితభావంతో సేవలందిస్తున్న పోలీసుల సేవలను గుర్తించి వారికి కిర్లంపూడి పోలీస్ స్టేషన్లో జగ్గంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్,కృష్ణవరం గ్రామ టీడీపి నాయకులు బొదిరెడ్ల సుబ్బారావు యూనిఫామ్ డ్రెస్సులు బహుకరించారు. ఈ కార్యక్రమంలో బొదిరెడ్ల సుబ్బారావుతో పాటు ఎంపీపీ తోట రవి,వీరవరం సొసైటీ చైర్మన్ తోట గాంధీ,జగ్గంపేట నియోజకవర్గ అభివృద్ధి కమిటీ మెంబర్ భూపాలపట్నం ప్రసాద్,కాకినాడ జిల్లా టిడిపి కార్యనిర్వహక కార్యదర్శి చదరం చంటిబాబు,మండల తెలుగు యువత కార్యదర్శి గండే కాశీ విశ్వనాధ్,జగపతినగరం సర్పంచ్ గుడాల రాంబాబు,సీనియర్ నాయకులు తూము కుమార్,కిర్లంపూడి సొసైటీ అధ్యక్షులు కుర్ల చినబాబు, కాళ్ళ వెంకటేష్ పాల్గొని వారికి యూనిఫామ్ డ్రెస్సులు అందచేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పోలీసుల సేవలు సమాజానికి ఆదర్శమని,వారి కష్టానికి తగిన గౌరవం కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా బొదిరెడ్ల సుబ్బారావును జగ్గంపేట సిఐ వై ఆర్ కె శ్రీనివాస్,కిర్లంపూడి ఎస్సై జి సతీష్ కుమార్ అభినందించారు.

## ఎన్డీఆర్ఎఫ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం



**పెద్దాపురం, పెన్ పవర్, ఫిబ్రవరి 11:** ఎన్డీఆర్ఎఫ్ బృందం ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో బుధవారం నిర్వహించారు.
విజయవాడలోని 10వ బెటాలియన్ ఎన్డీఆర్ఎఫ్ కమాండెంట్ వీవీఎన్ ప్రసన్న కుమార్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. విశాఖపట్నం ఎన్డీఆర్ఎఫ్ ప్రాంతీయ కేంద్రానికి చెందిన ఇన్‌స్పెక్టర్ సుశాంత్ కుమార్ బెహరా తన బృంద సభ్యులతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రాథమిక చికిత్స, రక్షణ చర్యల గురించి ప్రజలకు, సంబంధిత అధికారులకు వివరించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రజల్లో విపత్తుల పట్ల చైతన్యం కల్పించే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సిహెచ్ వెంకటలక్ష్మి, ఎస్ఐ వరికూటి మౌనిక, తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వంతో గుడ్ సీడ్ ఫౌండేషన్ ఆర్థిక సాయం.




**అమలాపురం/అంబాజీపేట, పెన్ పవర్, ఫిబ్రవరి 11:** ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో
అమలాపురం రూరల్ మండలం బండారులంక పంచాయితీ అంబేద్కర్ నగర్ కు చెందిన పులుసుగంటి రాజు
తీవ్రంగా గాయపడ్డాడు. ఆసుపత్రిలో చికిత్స అనంతరం ఇంటి వద్ద కోలుకుంటున్నాడు. ఆర్థిక భారంతో ఇబ్బందులు పడుతున్న రాజు కుటుంబానికి తమ వంతు సాయం చేసేందుకు గుడ్ సీడ్ ఫౌండేషన్ అధినేత, వైకాపా సీనియర్ నేత కుంచే రమణారావు మానవతా దృక్పథంతో ముందుకు వచ్చారు. గుడ్ సీడ్ ఫౌండేషన్ కార్యాలయం వద్ద బాధితుడు రాజు వైద్యం నిమిత్తం రూ.15 వేలు ఆర్థిక సాయం ఆర్థిక సహాయాన్ని అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆర్థికంగా అండగా నిలిచిన దాత రమణారావుకు బాధితుడు రాజు, అతని కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భీమనపల్లి సర్పంచ్ పెయ్యల రాజ్ కుమార్, ఈదరపల్లి మాజీ సర్పంచ్ నక్కా సంపత్ కుమార్, వైసీపీ నాయకులు వేగిరాజు సాయిరాజు,మాజీ సొసైటీ చైర్మన్ తోట శ్రీను,పినిపే జయరాజ్, నేలపూడి సుగంధ కుమార్,కంచర్ల జాన్సన్,పందిరి సుబ్బరాజు, నేరేడుమిల్లి శ్రీనివాసరావు, పులుసుగంటి నితిన్ కుమార్, బుద్ధసాగర్,జయ శేఖర్,గుడ్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## నేరాలు, సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



**పెద్దాపురం ఎస్ఐ వరికూటి మౌనిక**

**పెద్దాపురం, పెన్ పవర్, ఫిబ్రవరి 11 :** సమాజంలో పెరుగుతున్న నేరాలు, దొంగతనాలు, సైబర్ మోసాల పట్ల ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని పెద్దాపురం ఎస్ఐ వరికూటి మౌనిక సూచించారు. బుధవారం స్థానిక ఆర్టీసీ బస్ కాంప్లెక్స్ ఆవరణలో ప్రయాణికులు, ప్రజలతో ఆమె ప్రత్యేకంగా సమావేశమై పలు కీలక అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. దొంగతనాలు, గంజాయి వంటి అసాంఘిక కార్యకలాపాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అనుమానిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ప్రస్తుత కాలంలో సైబర్ మోసాలు పెరిగిపోతున్నాయని, గుర్తుతెలియని వ్యక్తులకు ఓటీపీలు చెప్పకూడదని, లాటరీల పేరుతో వచ్చే లింకులను క్లిక్ చేయవద్దని హెచ్చరించారు. ఏదైనా ఆపద కలిగినా, అత్యవసర పరిస్థితి ఎదురైనా ఏమాత్రం జాప్యం చేయకుండా వెంటనే పోలీసులను సంప్రదించాలని ప్రయాణికులకు సూచించారు. స్వీయ రక్షణ పద్ధతులు గురించి ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి.



**-ఏఓ నాగం సుధామాధురి.**

**కిర్లంపూడి, పెన్ పవర్, ఫిబ్రవరి 11:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారిణి నాగం సుధామాధురి అన్నారు. కిర్లంపూడి మండలంలోని రామచంద్రపురం గ్రామంలో శుక్రవారం ఏఓ నాగం సుధామాధురి ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల వ్యవసాయ శాఖాధికారిణి నాగం సుధామాధురి మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలన్నారు సూచించారు. అలాగే పంటల సాగులో ఎదురయ్యే పురుగులు,తెగుళ్ల నియంత్రణకు అవసరమైన పురుగు మందుల వినియోగం,వాటి మోతాదులు,జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అదేవిధంగా ఈ–క్రాప్ బుకింగ్ చేసుకునే విధానం,దానికి సంబంధించిన దశలవారీ ప్రక్రియను రైతులకు సవివరంగా వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు వెంకటలక్ష్మి పలువురు రైతులు పాల్గొన్నారు.

## ఆదిత్య యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ "నందూరి సుజాత"కు డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ



**గండేపల్లి, పెన్ పవర్, ఫిబ్రవరి ,11:**గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ ఫ్రెష్ మన్ ఇంజనీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పనిచేస్తున్న"నందూరి సుజాత " జవహర్ లాల్ నెహ్రూ టెక్నాలజీ యూనివర్సిటీ కాకినాడ నుంచి డాక్టరేట్ సాధించినట్లు ఆదిత్య యూనివర్సిటీ ప్రో.ఛాన్సలర్ డా. నల్లమిల్లి సతీష్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జవహర్ లాల్ నెహ్రూ టెక్నాలజీ యూనివర్సిటీ కాకినాడ కి చెందినమేథమటిక్స్ విభాగం ప్రొఫెసర్ డా. జి.వి.ఎస్.ఆర్. దీక్షితులు నేతృత్వంలోని "నందూరి సుజాత " సమర్పించిన "థీసిస్ శీర్షిక:"పెర్ఫార్మెన్స్ అనాలసిస్ ఆఫ్ క్యూస్ విత్ సింగిల్ అండ్ మల్టిపుల్ ఫ్రాక్షనల్ ఆర్డర్ సెర్వర్స్" అనే అంశంపై డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ పొందారని తెలిపారు. "డా."నందూరి సుజాత " భవిష్యత్ లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆదిత్య అధినేత, యూనివర్సిటీ ఛాన్సలర్ డా. ఎన్. శేషారెడ్డి, శుభాకాంక్షలు తెలిపారు. డిప్యూటీ ప్రో.ఛాన్సలర్ . డా.ఎం.శ్రీనివాస రెడ్డి, వైస్ ఛాన్సలర్. ప్రో. ఎం.బి. శ్రీనివాస్. ప్రో. వైస్ ఛాన్సలర్. డా. ఎస్. రమాశ్రీ, డా. ఆదిరెడ్డి రమేష్, డా. రవి తంగజన్, రిజిస్ట్రార్ డా జి.సురేష్, విభాగాధిపతి. డా.ఏ.వానతి మరియు వివిధ విభాగాల విభాగాధిపతులు ఉపాధ్యాయ సిబ్బంది "డా. నందూరి సుజాత"కి అభినందనలు తెలిపారు.

## ఆదిత్య విశ్వవిద్యాలయంలో ఐ.ఇఇఇ సిగ్నల్ ప్రాసెసింగ్ సొసైటీ స్టూడెంట్ బ్రాంచ్ చాప్టర్ ప్రారంభం






**గండేపల్లి, పెన్ పవర్, ఫిబ్రవరి ,11:**గండేపల్లి మండలం సూరంపాలెం: అదిత్య విశ్వవిద్యాలయం, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఐ.ఇఇఇ సిగ్నల్ ప్రాసెసింగ్ సొసైటీ స్టూడెంట్ బ్రాంచ్ చాప్టర్ ప్రారంభించినట్లు డిప్యూటీ ప్రో.ఛాన్సలర్ డా. ఎం. శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ వి.వి.ఎస్.ఎస్.ఎస్. చక్రవర్తి, చైర్, ఐ.ఇఇఇ సిగ్నల్ ప్రాసెసింగ్ సొసైటీ స్టూడెంట్ బ్రాంచ్ జాయింట్ చాప్టర్,ఐ.ఇఇఇ వైజాగ్ బే సెక్షన్ హాజరై ప్రసంగించారు..ఐ.ఇఇఇ సభ్యత్వ అభివృద్ధి, సిగ్నల్ ప్రాసెసింగ్ రంగంలో ఉన్న అవకాశాలు, పరిశోధన మరియు వృత్తిపరమైన అభివృద్ధి అంశాలపై ఆయన విద్యార్థులకు విలువైన మార్గనిర్దేశం చేశారు. విద్యార్థులుఐ.ఇఇఇ వంటి అంతర్జాతీయ వేదికల ద్వారా తమ సాంకేతిక నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలి, పరిశోధనాత్మక ఆలోచనలు పెంపొందించుకోవాలని సూచించారు. ఐ.ఇఇఇ సిగ్నల్ ప్రాసెసింగ్ సొసైటీ స్టూడెంట్ బ్రాంచ్ చాప్టర్ ద్వారా వర్క్‌షాప్‌లు, టెక్నికల్ సెమినార్లు, పోటీలు, పరిశ్రమఅకాడమిక్ అనుసంధాన కార్యక్రమాలు నిర్వహించబడతాయి అని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి విభాగాధిపతి, ఫ్యాకల్టీ సభ్యులు,ఐ.ఇఇఇ విద్యార్థి సభ్యులు హాజరయ్యారు. ఈ కొత్త చాప్టర్ ప్రారంభం విద్యార్థులకు సాంకేతిక విజ్ఞానం మరియు వృత్తిపరమైన అవకాశాలు మరింత విస్తృతంగా అందించేందుకు దోహదపడుతుందని విశ్వవిద్యలయ యాజమాన్యం అభిప్రాయపడింది.
ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ఐ.ఇఇఇ వైజాగ్ బే సెక్షన్ ప్రతినిధులకు, అధ్యాపకులకు మరియు విద్యార్థి వాలంటీర్లకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎం బి శ్రీనివాస్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి సురేష్,విభాగం అధిపతి ప్రొఫెసర్. గమిని శ్రీదేవి, ఆదిత్య విశ్వవిద్యాలయం ఐ.ఇఇఇ స్టూడెంట్ బ్రాంచ్ కౌన్సెలర్ ప్రొఫెసర్ వి శ్రీనివాస రావు, ఐ.ఇఇఇ స్టూడెంట్ బ్రాంచ్ చాప్టర్ ఫాకల్టీ అడ్వైసర్ ఎస్ జగదీశ్, నూతన కార్యవర్గ సభ్యులు, ఇతర అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## సమాజాభివృద్ధికి పాత్రికేయుల పాత్ర ఎంతో కీలకం.

* ప్రత్తిపాడు వైసిపి కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు.





**కిర్లంపూడి, పెన్ పవర్, ఫిబ్రవరి 11:** సమాజాభివృద్ధికి పాత్రికేయుల పాత్ర ఎంతో కీలకమని ప్రత్తిపాడు నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. బుధవారం మండల కేంద్రమైన కిర్లంపూడి మాజీ మంత్రి, రాష్ట్ర పొలిటికల్ అడ్వజరీ కమిటీ సభ్యులు ముద్రగడ పద్మనాభం స్వగృహంలో ముద్రగడ గిరిబాబు ప్రత్తిపాడు మండలం ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ పాత్రికేయులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముద్రగడ గిరిబాబు మాట్లాడుతూ ప్రజా సమస్యలను అధికారులు దృష్టికి ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లడమే కాకుండా, ప్రజా సమస్యల పరిష్కారానికి మీడియా పాత్ర అభినందనీయమన్నారు. వైసిపి కోఆర్డినేటర్ గా బాధ్యతలు చేపట్టి సంవత్సరకాలం అయిందని ఇంతవరకు పాత్రికేయులను వ్యక్తిగతంగా కలవలేకపోవడం జరిగిందన్నారు. ప్రతి ఒక్క పాత్రికేయ మిత్రుడుతోను వ్యక్తిగతంగా కలవాలనే ఉద్దేశంతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నా రాజకీయ ఎదుగుదలకు మీడియా మిత్రులు సలహాలు సూచనలు అందజేయడమే కాకుండా, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఈ సందర్భంగా మీడియా మిత్రులను గిరిబాబు కోరారు. ఈ సందర్భంగా పలువురు మీడియా మిత్రులు గిరిబాబుకు పలు సలహాలు సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు మండలం వైసిపి అధ్యక్షుడు రామిశెట్టి, మాజీ ఎమ్మెల్సీ అంగూరి లక్ష్మీ శివకుమారి, గౌతు స్వామి, ప్రత్తిపాడు నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు గుడాల వెంకటరత్నం, జగపతినగరం మాజీ పెంటకోట నాగబాబు, దలే చిట్టిబాబు, జల్లిగంపల ప్రభాకరరావు, ఏనుగు శ్రీనివాస్, పలువురు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

# అసెంబ్లీ శీతాకాల సమావేశాల్లో పాల్గొన్న జగ్గంపేట ఎమ్మెల్యే నెహ్రూ

**జగ్గంపేట, పెన్ పవర్, ఫిబ్రవరి 11:** ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాలు ఫిబ్రవరి 11వ తేదీ బుధవారం నుండి ప్రారంభమయ్యాయి. ఈ సమావేశాలకు జగ్గంపేట ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ హాజరయ్యారు. అసెంబ్లీ లాబీలో పలువురు ఎమ్మెల్యేలు, మంత్రులు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మూడు రోజులపాటు ఆయన స్వగ్రామం ఇర్రిపాకలో నిర్వహించిన శ్రీనివాస కళ్యాణం, సత్యదేవుడు కళ్యాణం, శివపార్వతుల కళ్యాణం విజయవంతంగా అంగరంగ వైభవంగా నిర్వహించినందుకు ఆయనను అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం స్పీకర్ అయ్యన్నపాత్రుడు అధ్యక్షతన జరిగిన బీఏసీ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. మార్చి 7 వరకు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని బీఏసీలో నిర్ణయించింది. ఈనెల 14న బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు.



## మాతృమూర్తి జ్ఞాపకార్థం సేవా కార్యక్రమాలు నిర్వహించిన అడపా దుర్గారావు.





**ఏలేశ్వరం, పెన్ పవర్, ఫిబ్రవరి 11:** స్థానిక మార్స్ కంప్యూటర్ కోచింగ్ సెంటర్ , డిస్టెన్స్ ఎడ్యుకేషన్ సెంటర్ అధినేత అడపా దుర్గారావు మాతృమూర్తి సత్యవతి 9వ వర్ధంతి సందర్భంగా ఆమె జ్ఞాపకార్థం పలు సేవా కార్యక్రమాలు బుధవారం నిర్వహించారు. తొలుత మాతృమూర్తి సత్యవతి చిత్రపటానికి దుర్గారావు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం స్వామి దయానంద సరస్వతి అనాధ ఆశ్రమానికి 25 కేజీలు బియ్యం, కూరగాయలు, నిత్యావసర సరుకులు ఆశ్రమ ఇంచార్జ్ శేఖర్ కు అందజేయడం జరిగింది. బ్రాహ్మణ వీధిలో ఉన్న శివాలయం వద్ద పేదలకు భోజనాలు ఏర్పాటు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కోరాడ రాజు, గోళ్ళ విజయ్ కుమార్, మద్దుల స్వరూప్, గంపా చరణ్ తేజ్, గంపా అనిల్ కుమార్, కోచింగ్ సెంటర్ విద్యార్థులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే గోరంట్ల



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 11 :**స్థానిక గాంధీపురంలో ఉన్న రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి నివాసంలో 23 మంది లబ్దిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన 11 లక్షల 42 వేల 916 రూపాయల చెక్కులను, 7 లక్షల విలువైన రెండు ఎలఓసిలు అందచేసారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలకు సిఎం సహాయ నిధి ద్వారా ఇతోధికంగా సహాయం అందుతోం దన్నారు. పేదలకు, మధ్య తరగతి కుటుంబాలను ఆదుకునేందుకు తమ వంతు బాధ్యతగా పారదర్శకంగా లబ్ధిదారులను గుర్తించి వాటికి అవసరమైన అన్ని పత్రాలతో తమ కార్యాలయం ద్వారానే సిఎం రిలీఫ్ ఫండ్‌కు పంపుతున్నామన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా వర్తించని వాటికి ఈ సహాయం అందిస్తున్నామన్నారు. . కొన్ని ఆసుపత్రుల్లో అవసరమైన వైద్యం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో ఎ.ఎం.సి చైర్మన్ మార్ని వాసుదేవ్, రూరల్ టీడీపీ అధ్యక్షుడు మత్సేటి ప్రసాద్, రాష్ట్ర కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్లు పందూరి అప్పారావు, దాలిపర్తి వేమన, పిన్నమరెడ్డి ఈశ్వరుడు, నున్న కృష్ణ, , మట్టా శ్రీను, నిమ్మలపూడి రామకృష్ణ, దుద్దుపూడి రమేష్, ఏడాకుల వెంకటేశ్వరరావు, చలమూరి సత్యనారాయణ, , సింగవరపు సత్యనారాయణ, పుక్కళ్ళ రాజు, గుర్రపు సత్యనారాయణ, తూము శ్రీను, ముమ్మిడి దేవీ నాగేశ్వరరావు, సురపురెడ్డి భరత్, బత్తుల వాసు, గోరు నాగేశ్వరరావు, దొంతంశెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత: ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి.





**ఏలేశ్వరం, పెన్ పవర్, ఫిబ్రవరి 11:** గ్రామాల అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి ఎన్ డి ఏ కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తుందని ఏలేశ్వరం మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు గొల్లపల్లి నరసింహమూర్తి (బుజ్జి) అన్నారు. మండల పరిధిలోని పెద్దనాపల్లి గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలకు బుధవారం శంకుస్థాపన చేశారు.
ఏలేశ్వరం మండల ప్రజా పరిషత్ నిధులు నుంచి
గ్రామం లో గల అసంపూర్ణం గా ఉన్న అంగన్వాడీ భవనం నిర్మాణం హ్యాండ్ పంపు పనులకు శంకుస్థాపన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమం లో లింగంపర్తి పిఎసిఎస్ అధ్యక్షుడు పెంటకోట మోహన్ ,సర్పంచ్ బుద్ద సూర్య ప్రకాష్ ,ఎంపీటీసీ బుద్ధ ఈశ్వరరావు సత్యవతి ,గ్రామ టీడీపీ నాయకుడు సుంకర సత్తిబాబు, ఎండిఓ , పంచాయతీ పాలక వర్గ సభ్యులు, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాలువ గట్ల ఆక్రమణలపై తగిన చర్యలు-

చింతలూరు నీటిపారదల సంఘం అధ్యక్షుడు గారపాటి శ్రీనివాస్ చౌదరి.



**ఆలమూరు, పెన్ పవర్, ఫిబ్రవరి 11;** చింతలూరులో జొన్నాడ - వెదురుమూడి కాలువకు సంబంధించిన గట్ల ఆక్రమణలు తొలగించి రైతులకు న్యాయం చేస్తామని చింతలూరు నీటిసంఘం అధ్యక్షుడు గారపాటి శ్రీనివాస్ చౌదరి తెలిపారు. చింతలూరు గ్రామ పంచాయతీ కార్యదర్శికి వీరన్నచౌదరికి సదరు కాలువ హద్దులు, ఆక్రమణలపై ఆయన దరఖాస్తు చేయగా సర్వేయర్ అనూష, వీఆర్వో శేఖర్, సిబ్బందితో కల్సి బుధవారం సర్వే నిర్వహించారు. ఆక్రమణలను గుర్తించామని సర్వేయర్ తెలిపారు. వాటి వివరాలను పై అధికారులకు తెలియజేస్తామన్నారు. నీటిపారుదల శాఖ ఆస్తులను ఆక్రమించుకున్నవారికి శాఖ సిబ్బంది ద్వారా నోటీసులు పంపిస్తామని, వారి స్పందనను అనుసరించి ఆ పై చర్యలు తీసుకుంటామని నీటిపారుదల సంఘం అధ్యక్షుడు గారపాటి శ్రీనివాస్ చౌదరి మీడియాకు తెలిపారు.

# 187 కిలోల గంజాయి స్మగ్లింగ్ కేసులో ప్రధాన నిందితుడు అరెస్ట్



**అంతర్రాష్ట్ర నిఘాతో పట్టుకున్న పోలీసులు**

**గంగవరం ఎస్సై వెంకటేష్**

**గంగవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 11:**2024 సెప్టెంబర్ లో గంగవరం గ్రామ శివారులో 187 కేజీల గంజాయి స్వాధీనం కేసులో ప్రధాన నిందితుడి లాకే సహదేవ్ అనే టైగర్ సాయి ని అరెస్ట్ చేసినట్లు గంగవరం ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.

పోలవరం జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్ ఆదేశాల మేరకు రంపచోడవరం ఎస్‌డిపిఓ జి. సాయి ప్రశాంత్ పర్యవేక్షణలో గంగవరం పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదున గంజాయి కేసులో సుమారు 187 కిలోల గంజాయి స్మగ్లింగ్ కు సంబంధించి ప్రధాన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసులో గంజాయి సరఫరా, ప్యాకింగ్, రవాణా నిర్వహించడం తో పాటు ఇతరులకు డబ్బులు పంపిణీ చేసి నేరానికి సహకరించిన ప్రధాన నిందితుడు లాకే సహదేవ్ అనే టైగర్ సాయి (33) ను అదుపులోకి తీసుకోవడం జరిగిందని ఎస్సై వెంకటేష్ తెలిపారు. అడ్డతీగల సి.ఐ బి. నరసింహమూర్తి, ఎస్.ఐ బి. వెంకటేష్ మరియు సిబ్బంది ఆధునిక సాంకేతిక పద్ధతులను వినియోగించి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. సీడీఆర్ విశ్లేషణ, పోలీస్ టెక్నాలజీ యాప్స్, ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్, డిజిటల్ ఫైనాన్షియల్ ట్రాన్సాక్షన్ ట్రాకింగ్, సర్వైలెన్స్ ఇన్‌పుట్స్, టెక్నికల్ ఇంటెలిజెన్స్, అంతర్రాష్ట్ర సమన్వయం, గోప్య నిఘా వంటి పద్ధతుల ద్వారా నిందితుడి కదలికలను గుర్తించి అరెస్ట్ చేసినట్లు అధికారులు తెలిపారు. విచారణలో నిందితుడు కిర్లంపూడి పోలీస్ స్టేషన్ క్రైమ్ నెంబర్. 125/2020 (80 కిలోల గంజాయి) కేసులో పరారీలో ఉన్నట్లు, అలాగే గొలుగొండ పోలీస్ స్టేషన్ క్రైమ్ నెంబర్. 101/2021 (193 కిలోల గంజాయి) కేసుల్లో కూడా ప్రమేయం ఉన్నట్లు వెలుగులోకి వచ్చినట్లు ఎస్సై వెల్లడించారు. అరెస్ట్ చేసిన అనంతరం నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. ఈ అరెస్టులో విశేష కృషి చేసిన పోలీసు అధికారులను జిల్లా ఉన్నతాధికారులు అభినందించారు. విలేకరుల సమావేశంలో ఏఎస్ఐ మహర్షి పోలీస్ సిబ్బంది ఉన్నారు.

# లేబర్ చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

**ఆలమూరు, పెన్ పవర్, ఫిబ్రవరి 11;** పరిశ్రమలు, ఇటుక బట్టీ యాజమానులందరూ లేబర్ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని మండపేట అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కాశి శివ నాగ మల్లేశ్వరరావు అన్నారు. ఆలమూరులోని శ్రీ కృష్ణదేవరాయ కాపు కల్యాణ మండపంలో బుధవారం మండల ఇటుక బట్టీ యజమానులతో అవగాహన సదస్సు జరిగింది. ఈసందర్భంగా ఆయన ఈశ్రమ, పీఎంఎస్ వైఎం పెన్షన్ నమోదు, యజమానులుకు వర్తించే కఠినతరమైన చట్టాలగురించి అవగాహన కల్పించారు. యజమానులందరూ కార్మికశాఖ నుంచి లైసెన్స్ పొంది ప్రతియేటా నవీకరణ చేసుకోవాలన్నారు. ప్రతి యేటా జనవరి నెలలో వెల్ఫేర్ ఫండ్ ను చెల్లించాలన్నారు. పూరించిన దరఖాస్తును జతపరిచి కార్యాలయంలోకి అందజేయాలన్నారు. అలాగే కార్మికులకు గుర్తింపు కార్డులను అందజేసి, అవివరాలను కార్యాలయంలో అందజేయాలన్నారు. కార్మికులందరికీ వారంతపు శెలవులను ఖచ్చితంగా ఇవ్వాలని కోరారు. చట్ట అతిక్రమణ చేసిన యజమానులు చట్టరీత్యా తీసుకునే చర్యలకు శిక్షకు భాద్యులవుతారని హెచ్చరించారు. తహసీల్దార్ కెజె.ప్రకాష్ బాబు, ఇటుక బట్టీ యజమానులు పాల్గొన్నారు.



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

పెన్ పవర్

గురువారం 12 ఫిబ్రవరి 2026

## టీమిండియా మాపై 250 కొట్టే ప్రశ్నే లేదు: నమీబియా యువ ఫాస్ట్ బౌలర్ ధీమా

**టీమిండియాను 180 పరుగులకే పరిమితం చేస్తామన్న మాక్స్ హీంగో**

**భారత్‌లో 50 వేల మంది ప్రేక్షకుల మధ్య ఆడటం ఒత్తిడేనని అంగీకారం**

**గత మ్యాచ్‌లో ఒకే ఒక్క క్యాచ్ డ్రాప్ వల్ల ఓడిపోయామని విచారం**

**కోచ్ గ్యారీ కిర్‌స్టెన్ అనుభవం తమకు ఎంతో ఉపయోగపడుతోందని వెల్లడి**



**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 ప్రపంచకప్‌లో భాగంగా రేపు గురువారం నాడు అరుణ్ జైట్లీ స్టేడియంలో డిఫెండింగ్ ఛాంపియన్ భారత్‌తో ఆఫ్రికా పసికూన నమీబియా తలపడనుంది. అయితే, ఈ మ్యాచ్‌లో టీమిండియాను 180 పరుగులకే కట్టడి చేస్తామని నమీబియా 18 ఏళ్ల యువ ఫాస్ట్ బౌలర్ మాక్స్ హీంగో ధీమా వ్యక్తం చేశాడు. టీమిండియా బ్యాటింగ్ లైనప్ పటిష్టంగా ఉన్నప్పటికీ, తమ బౌలింగ్‌తో వారిని తక్కువ స్కోరుకే పరిమితం చేయగలమని అన్నాడు."భారత్ మాపై 250 పరుగులకు పైగా స్కోర్ చేసే ప్రసక్తే లేదు. బహుశా వారు 180 పరుగులు చేయొచ్చు. కానీ, 300 పరుగులు మాత్రం అస్సలు చేయలేరు" అని మ్యాచ్‌కు ముందు ఐఏఎన్ఎస్‌కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో హీంగో పేర్కొన్నాడు. నెదర్లాండ్స్‌తో జరిగిన గత మ్యాచ్‌లో నమీబియా ఏడు వికెట్ల తేడాతో ఓటమిపాలైన సంగతి తెలిసిందే. భారత్‌లో, వారి సొంత ప్రేక్షకుల మధ్య ఆడటంపై హీంగో స్పందిస్తూ.. "50 వేల మంది ప్రేక్షకుల మధ్య ఆడటం ఒత్తిడితో కూడుకున్నప్పటికీ, ఇది ఒక అద్భుతమైన అనుభూతి. నాలో కంగారు ఉన్నా, నా నైపుణ్యాలను ప్రదర్శించడానికి సిద్ధంగా ఉన్నాను. నా సహచరులు నాకు ధైర్యం చెబుతున్నారు" అని తెలిపాడు. నెదర్లాండ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఒకే ఒక్క క్యాచ్ డ్రాప్ కారణంగా ఓడిపోయామని, ఇది తమను నిరాశపరిచిందని అన్నాడు.

భారత్‌కు 2011 వన్డే ప్రపంచకప్ అందించిన గ్యారీ కిర్‌స్టెన్ తమ జట్టుకు కన్సల్టెంట్ కోచ్‌గా ఉండటం ఎంతో మేలు చేస్తోందని, ఆయన అనుభవం జట్టుకు ఉపయోగపడుతోందని హీంగో వివరించాడు. పేద కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన హీంగో, తన పాఠశాలలో క్రికెట్ ఆడటం మొదలుపెట్టి, ప్రతిభతో జాతీయ జట్టులో చోటు సంపాదించాడు. దక్షిణాఫ్రికా పేసర్ కగిసో రబాడాను స్ఫూర్తిగా తీసుకున్నానని, సీనియర్ బౌలర్లు రూబెన్ ట్రంపెల్‌మన్, జేజే స్మిత్ నుంచి ఎన్నో విషయాలు నేర్చుకుంటున్నానని అతను పేర్కొన్నాడు.

## టీ20 వరల్డ్ కప్: ఆసీస్ కు గట్టి ఎదురుదెబ్బ... కెప్టెన్ మార్ష్ కు తీవ్ర గాయం

**ప్రాక్టీస్‌లో మార్ష్ కు గజ్జల్లో బంతి తగలడంతో అంతర్గత రక్తస్రావం**

**స్టాండ్‌బై ప్లేయర్‌గా శ్రీలంకకు స్టీవ్ స్మిత్**

**ఐర్లాండ్‌తో మ్యాచ్‌కు ట్రావిస్ హెడ్ కెప్టెన్సీ**



**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 ప్రపంచకప్‌లో టైటిల్ ఫేవరెట్లలో ఒకటిగా బరిలోకి దిగిన ఆస్ట్రేలియాకు టోర్నీ ఆరంభంలోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. జట్టు కెప్టెన్ మిచెల్ మార్ష్ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ వారం ప్రాక్టీస్ సెషన్‌లో గజ్జల్లో బంతి బలంగా తగలడంతో అతను అంతర్గత రక్తస్రావంతో బాధపడుతున్నాడు. దీంతో నేడు ఐర్లాండ్‌తో మ్యాచ్‌కు మార్ష్ దూరమయ్యాడు. అతని స్థానంలో ట్రావిస్ హెడ్ తాత్కాలికంగా జట్టుకు నాయకత్వం వహిస్తున్నాడు.ఈ గాయంపై క్రికెట్ ఆస్ట్రేలియా ఒక ప్రకటన విడుదల చేసింది. "మార్ష్‌కు తీవ్రమైన నొప్పి, అసౌకర్యం ఉన్నాయి. కదలడానికి కూడా ఇబ్బంది పడుతున్నాడు. స్కానింగ్‌లో అంతర్గత రక్తస్రావం జరిగినట్లు నిర్ధారణ అయింది. అతనికి కొంతకాలం విశ్రాంతి అవసరం. లక్షణాలు తగ్గిన తర్వాత, వైద్యుల సలహా మేరకు అతను తిరిగి ఎప్పుడు ఆడతాడో నిర్ణయిస్తాం" అని తెలిపింది.ముందుజాగ్రత్త చర్యగా, స్టాండ్‌బై ప్లేయర్‌గా ఉన్న స్టార్ బ్యాటర్ స్టీవ్ స్మిత్‌ను శ్రీలంకకు రావాల్సిందిగా జట్టు యాజమాన్యం కోరింది. అతను అక్కడి వాతావరణానికి అలవాటుపడి, అవసరమైతే జట్టులోకి రావడానికి సిద్ధంగా ఉంటాడు. ప్రస్తుతానికి స్మిత్‌ను అధికారికంగా ప్రపంచకప్ స్క్వాడ్‌లో చేర్చలేదు. అయితే, ఇప్పటికే హేజిల్‌వుడ్ స్థానాన్ని భర్తీ చేయకపోవడంతో ఆసీస్ 15 మంది సభ్యుల జట్టులో ఒక ఖాళీ ఉంది.

ఇప్పటికే హేజిల్‌వుడ్, పాట్ కమిన్స్ వంటి కీలక బౌలర్లు గాయాలతో దూరం కాగా, ఇప్పుడు కెప్టెన్ మార్ష్ గాయపడటం ఆస్ట్రేలియాను మరింత ఆందోళనకు గురిచేస్తోంది. అయితే, మరో పేసర్ నాథన్ ఎల్లిస్ గాయం నుంచి కోలుకుని ఐర్లాండ్‌తో మ్యాచ్‌కు అందుబాటులోకి రావడం కాస్త ఊరటనిచ్చే అంశం.

## టీ20 వరల్డ్ కప్: ఒకే మ్యాచ్‌లో రెండు సూపర్ ఓవర్లు.. థ్రిల్లింగ్ పోరులో ఆఫ్ఘన్‌పై సఫారీల గెలుపు

**ప్రధాన మ్యాచ్ టై.. సూపర్ ఓవర్‌కు దారితీసిన ఉత్కంఠ**

**తొలి సూపర్ ఓవర్ కూడా టై.. రెండో సూపర్ ఓవర్‌తో మరింత డ్రామా**

**రెండో సూపర్ ఓవర్‌లో 23 పరుగులు చేసిన దక్షిణాఫ్రికా**

**గుర్బాజ్ హ్యాట్రిక్ సిక్సర్లతో పోరాడినా.. చివరి బంతికి ఓడిన ఆఫ్ఘన్**

**5 పరుగుల తేడాతో థ్రిల్లింగ్ విజయం అందుకున్న సఫారీలు**



**హైదరాబాద్ పెన్ పవర్:** క్రికెట్ చరిత్రలోనే అత్యంత అరుదైన, ఉత్కంఠభరితమైన మ్యాచ్‌లలో ఒకటిగా నిలిచిపోయే పోరులో దక్షిణాఫ్రికా అద్భుత విజయం సాధించింది. టీ20 ప్రపంచకప్‌లో భాగంగా ఆఫ్ఘనిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో ఫలితం కోసం ఏకంగా రెండు సూపర్ ఓవర్లు ఆడాల్సి వచ్చింది. చివరికి, రెండో సూపర్ ఓవర్‌లో 5 పరుగుల తేడాతో గెలిచిన సఫారీ జట్టు ఊపిరి పీల్చుకుంది. అహ్మదాబాద్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో చివరి బంతి వరకు ఇరు జట్ల ఆటగాళ్లు కనబరిచిన పోరాట పటిమ అభిమానులను మునివేళ్లపై నిలబెట్టింది.రెండో సూపర్ ఓవర్‌లో ఆఫ్ఘనిస్థాన్ విజయానికి 24 పరుగులు అవసరమవ్వగా, ఆ జట్టు బ్యాటర్ రహ్మానుల్లా గుర్బాజ్... సఫారీ స్పిన్నర్ కేశవ్ మహరాజ్ బౌలింగ్‌లో వరుసగా మూడు సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. దీంతో సమీకరణం చివరి బంతికి 6 పరుగులుగా మారింది. ఈ దశలో మహరాజ్ విసిరిన వైడ్ బాల్‌తో ఉత్కంఠ తారాస్థాయికి చేరింది. అయితే, చివరి బంతికి గుర్బాజ్ భారీ షాట్‌కు యత్నించి మిల్లర్‌కు క్యాచ్ ఇవ్వడంతో ఆఫ్ఘన్ పోరాటం ముగిసింది. అంతకుముందు, ఈ సూపర్ ఓవర్‌లో మొదట బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా డేవిడ్ మిల్లర్ (2 సిక్సర్లు) చెలరేగడంతో వికెట్ నష్టపోకుండా 23 పరుగులు చేసింది.వాస్తవానికి, ఈ మ్యాచ్‌లో తొలి సూపర్ ఓవర్ కూడా టైగా ముగియడంతోనే రెండో సూపర్ ఓవర్ అనివార్యమైంది. తొలి సూపర్ ఓవర్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఆఫ్ఘన్ 17 పరుగులు చేయగా, ఛేదనలో సఫారీలకు చివరి బంతికి 6 పరుగులు అవసరమయ్యాయి. ఫజల్‌హక్ ఫరూఖీ బౌలింగ్‌లో ట్రిస్టన్ స్టబ్స్ సిక్సర్ బాదడంతో స్కోర్లు సమం అయ్యాయి. దీంతో క్రికెట్ అభిమానులు మరో అరుదైన ఘట్టానికి సాక్షులుగా నిలిచారు.

అంతకుముందు, ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 187 పరుగులు చేసింది. క్వింటన్ డికాక్ (59), ర్యాన్ రికెల్టన్ (61) అర్ధ సెంచరీలతో రాణించారు. అనంతరం 188 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆఫ్ఘనిస్థాన్ కూడా సరిగ్గా 187 పరుగులకే ఆలౌట్ కావడంతో మ్యాచ్ టైగా ముగిసింది. ఆఫ్ఘన్ ఇన్నింగ్స్‌లో రహ్మానుల్లా గుర్బాజ్ (84) అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. అయితే, అతని పోరాటం ప్రధాన ఇన్నింగ్స్‌లోనూ, ఆ తర్వాత సూపర్ ఓవర్‌లోనూ జట్టును గెలిపించలేకపోయింది.

## ఆ హీరోకు ఎవరూ సాటి లేరు



ఆకాన్షా రంజన్ కపూర్ ఎలక్ట్రిక్ బ్లూలో దేశీ దివా గ్లామ్‌ను ప్రసరిస్తుంది

ఒకప్పుడు టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న నటి లయడ దాదాపు పదేళ్ల క్రితం సినిమాలకు గుడ్‌బై చెప్పి అమెరికాలో స్థిరపడ్డ సంగతి తెలిసిందే. కుటుంబ జీవితం, వ్యక్తిగత ప్రాధాన్యాలకే ఎక్కువ సమయం కేటాయించిన లయ, మళ్లీ సినిమాల వైపు చూస్తారని అప్పట్లో ఎవ్వరూ ఊహించలేదు. కానీ కాలం మారింది. సోషల్ మీడియాలో ఆమె చేసిన డ్యాన్స్ రీల్స్ ఒక్కసారిగా వైరల్ కావడంతో, లయ పేరు మళ్లీ ఇండస్ట్రీలో చర్చకు వచ్చింది. అదే పాపులారిటీ ఇప్పుడు ఆమె రీ-ఎంట్రీకి బలమైన పునాది అయింది.



### విజయేంద్రవర్మలో బాలయ్యతో కలిసి నటించిన లయ

ప్రస్తుతం లయ, శివాజీ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న సాంప్రదాయిని సుప్పిణి సుద్ధపూసణి అనే వెబ్ ఫిల్మ్‌తో గ్లామర్ ప్రపంచంలోకి మరోసారి అడుగుపెడుతున్నారు. ఈ నేపథ్యంలో లయ ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో నందమూరి బాలకృష్ణ గురించి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి. 2004లో విడుదలైన విజయేంద్ర వర్మ సినిమాలో బాలకృష్ణ సరసన హీరోయిన్‌గా నటించిన అనుభవాన్ని గుర్తు చేసుకున్న లయ, ఆయనపై ప్రశంసల జల్లు కురిపించారు.

### ఆయన చాలా ప్రొఫెషనల్

బాలకృష్ణ గారు ఎంతో ప్రొఫెషనల్ అని, సెట్స్‌లో ఆయనతో కలిసి పని చేయడం చాలా సులువుగా ఉంటుందని, ఆయన అందరినీ నవ్విస్తూ, పాజిటివ్ ఎనర్జీతో వాతావరణాన్ని హాయిగా ఉంచుతారని, డిసిప్లిన్, టాలెంట్ విషయంలో ఆయనకు ఎవరూ సాటి లేరంటూ లయ చెప్పుకొచ్చారు. ఫ్యూచర్ లో మళ్లీ ఆయనతో కలిసి నటించాలని తన కోరికను కూడా ఆమె ఈ సందర్భంగా బయటపెట్టారు.

### ఆ కాంబో మళ్లీ కుదిరేనా?

ఇప్పటి ట్రెండ్‌ను గమనిస్తే, సీనియర్ హీరోలు తమ వయసుకు దగ్గరగా ఉన్న హీరోయిన్లతో జోడీ కట్టేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ క్రమంలో బాలకృష్ణ లాంటి స్టార్, డబుల్ రోల్స్ చేసే కథల్లో లయ లాంటి సీనియర్ హీరోయిన్ తో అయితే స్క్రీన్‌పై మంచి బ్యాలెన్స్ కుదిరే అవకాశం ఉందనే అభిప్రాయం కూడా వినిపిస్తోంది. లయబాలయ్య కాంబినేషన్ మళ్లీ రిపీట్ అయితే ప్రేక్షకుల్లో నాస్టాల్జియా ఫీలింగ్‌తో పాటు కొత్త ఇంట్రెస్ట్ కూడా ఏర్పడే అవకాశముంది.అయితే లయ రీ-ఎంట్రీ విషయానికి వస్తే, నితిన్ నటించిన 'తమ్ముడు' సినిమా ఆమెకు ఆశించిన స్థాయిలో గుర్తింపు తీసుకురాలేదు. అయినప్పటికీ ఆమె ఆశలు ఇప్పుడు శివాజీ వెబ్ ప్రాజెక్ట్‌పైనే ఉన్నాయి. ఈ సినిమా గనుక హిట్ అయితే, లయ కెరీర్‌కు ఇది టర్నింగ్ పాయింట్‌గా మారే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అప్పుడు ఆమెకు మళ్లీ పెద్ద సినిమాల నుంచి, ముఖ్యంగా సీనియర్ హీరోల సరసన నటించే ఆఫర్లు వచ్చే ఛాన్సుంది. మొత్తానికి, లయ సెకండ్ ఇన్నింగ్స్‌పై టాలీవుడ్ ఆసక్తిగా ఎదురుచూస్తోంది.



ఆకాంక్ష శర్మ ఎమరాల్డ్ గ్రీన్ కో-ఆర్డ్ సెట్‌లో బోల్డ్ మరియు గ్లామరస్‌గా ఉంది

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com